
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 24 అక్టోబరు 2024



- ఆరు నెలల నుంచి జమకాని స్టాంప్‌డ్యూటీ
- మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నిధుల గండం



రిజిస్ట్రార్ కార్యాలయం







డ్రోనాచార్యులు

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం

అందరి లక్ష్యం సులభతర సేవలే

రైతుల కష్టాలే స్ఫూర్తిగా డ్రోన్ల సృష్టి

ఆంధ్రజ్యోతితో ఔత్సాహిక ఇంజనీర్లు, విద్యార్థులు

సాంకేతికత.. వినూత్న ఆలోచన.. సులభతరం.. వేగవంతం.. తక్కువ ఖర్చు.. ఏదో సాధించాలన్న తపనతో నేటి యువతరం ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి.. రైతు బిడ్డలు వినూత్నంగా స్పందించారు. ప్రకృతి వైపరీత్యాల్లో సులభంగా సేవలు అందించాలని మరికొందరు ముందుకు వచ్చారు. సీనియర్లు అందించిన పరిజ్ఞానాన్ని పరిశీలించి మరింత నాణ్యంగా, నైపుణ్యతతో ఆలోచించారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరి వేదికగా నిర్వహిస్తున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024 వారి కష్టాన్ని, సాధించిన ఘనతను ప్రపంచం ముందు ఉంచింది. వారి ఆనందాన్ని, వారి కష్టాల వెనుక ఉన్న నేపథ్యాన్ని వారు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. ఎవరి అనుభవాలు వారివి.. ఎవరి దృష్టి కోణం వారిది.. కానీ లక్ష్యం మాత్రం అద్భుతమైన విహంగాలను సృష్టించడం. ఒకప్పుడు కేవలం ఫంక్షన్లలో వీడియోలు తీయడానికే పరిమితమైన డ్రోన్ సేవలు ఇప్పుడు అనేక రంగాల్లోకి విస్తరించాయి. ఏదో సాధించాలన్న తపన.. కొత్తదనం కోసం ఆరాటం.. అందుకోసం ఔత్సాహిక యువ ఇంజనీర్లు, విద్యార్థులు సాగించిన అన్వేషణ.. వారికి లభించిన ప్రోత్సాహం.. తోడ్పాటు.. వెరసి రాబోయే యుగ దూతగా డ్రోన్లు ప్రజల ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైన డ్రోన్ సమ్మిట్ వారి ఉత్సాహాన్ని మరింత పెంచింది.

రైతుల కష్టాలు చూసి కదిలిపోయా



మాది కృష్ణాజిల్లా ఉయ్యూరు పక్కన నెప్పల్లి గ్రామం. మాది రైతు కుటుంబం. ఎరువులు, పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు, కూలీలు పడే కష్టం, జరిగే ప్రాణాంతక ప్రమాదాలు చూశా. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశాను. చదువు వ్యవసాయానికి ఉపయోగపడేలా ఆలోచించా. మా ఫ్రెండ్ కమల్ తోడుగా నిలిచాడు. ఇద్దరం కలిసి హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్‌ను సిద్ధం చేశాం. దానితో ప్రతి రోజూ 30 ఎకరాల్లో సులువుగా ఎరువులు, పురుగు మందులు చల్లవచ్చు. డ్రోన్లు కొనలేనివారికి కూడా మేం సేవలు అందిస్తున్నాం. ఇప్పటికి 25వేల ఎకరాల్లో డ్రోన్లతో సేవలు చేస్తు న్నాం. లాజిస్టిక్ డ్రోన్లు ద్వార వరదల్లో చిక్కుకున్న విజయవాడ వాసులకు ఆహార పొట్లాలు, నీళ్లు, అత్యవసర మందులు అందజేశాం.

-గోపీ వెంకట కృష్ణ, ఉయ్యూరు

ఆరో తరగతి నుంచి ప్రయోగాలే



మాది విశాఖపట్నం. మెకానికల్ ఇంజనీరింగ్ చదివా. చిన్నప్పటి నుంచి నాకు విమానాలు అంటే ఆసక్తి. అందుకే నేను ఆరో తరగతి నుంచే ప్రయోగాలు చేసేవాడిని. మా నాన్నగారు నన్ను ప్రోత్సహించేవారు. ఖర్చు భరించేవారు. కాలేజీలో చేరాక నా ఆసక్తికి మార్గం దొరికింది. ఇండస్ట్రియల్ డ్రోన్లు రూపొందించా. వాటిని ప్రమోట్ చేసేందుకు పెద్ద పెద్ద సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకూ 10 సమ్మిట్లలో పాల్గొన్నా. రఘు ఇంజనీరింగ్ కాలేజీలో 2వ బహుమతి వచ్చింది.

- ఏ. ప్రవీణ్, విశాఖపట్నం

తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం



మేం ఎస్సార్‌ఎం కాలేజీలో చదువుతున్నాం. అత్యవసర మందులు అందించేందుకు వీలుగా డ్రోన్లు రూపొందించాం. సెల్ ఫోనులో వినియోగించే బ్యాటరీకి రెట్టింపు సైజులో అంటే 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో నడిచే తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం. దాన్ని అందించడానికి ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్ ఏర్పాటు చేసి, ఆటోమేటిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి 10 కి.మీ. పరిధిలో మందులు అందించేందుకు వీలుగా డ్రోను రూపొందించాం.ఆమోదం వస్తే సేవలు మొదలుపెడతాం.

- మణికంఠ, పుష్పక్, అజిత్

అవయవాల తరలింపు కోసం డ్రోన్

కిలో.. రెండు కిలోల లగేజీ మోసే డ్రోన్లకు భిన్నంగా రూపొందించాలని భావించాం. అందుకే 7 కిలోల పే లోడ్ ఉండేలా డ్రోన్ రూపొందించాం. ఇందులోని బ్యాగులో మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ చల్లదనం ఉంటుంది. అందువల్ల అత్యవసర మందులు, మానవ అవయవాలు భద్రంగా, వేగంగా తరలించవచ్చు. వేగం కూడా గంటకు 125 కి.మీ. ఒకసారి చార్జ్ చేస్తే 150 కిలో మీటర్ల దూరం ప్రయాణించగలదు.

- ఏకాంత్, తంజావూర్



హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్



మాది తాడేపల్లిగూడెం పాలకొల్లు ప్రాంతం. రైతుల సమస్యలు చూసి డ్రోన్ల రూపకల్పన ఆలోచన చేశాం. కరోనా సమయంలో ఎరువులు, పురుగు మందులు ఉన్నా కూలీలు దొరక్క రైతులు నష్టపోయారు. అప్పుడే ఆలోచన చేసి డ్రోన్ల రూపకల్పన చేశాం. హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్ ఏర్పాటు చేశాం. ఆంధ్రుల తొలి డ్రోన్ స్టార్టప్ మాదే కావడం విశేషం. 80 డ్రోన్లు రూపొందించాం. తొలి రోజుల్లో మేమే వెళ్లి స్వయంగా ఎరువులు, మందులు చల్లాం.ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధమైంది. ఇలాంటివి 2025 నాటికి 2000 డ్రోన్లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రోత్సాహకాలు బాగున్నాయి. అందుకే హైదరాబాద్ నుంచి ఏపీ వచ్చేయాలనుకుంటున్నాం.

- హేమంత్, హనుమ, సాయిచరణ్

స్వామ్ డ్రోన్లదే రాజ్యం




ముందు ముందు స్వామ్ డ్రోన్లదే రాజ్యం. తమ సీనియర్లు డ్రోన్లు రూపొందించి ఆ విజ్ఞానాన్ని మాకిచ్చారు. అంతకన్నా భిన్నంగా రూపొందించాలని ఆలోచించాం. ఒక డ్రోన్ పనిచేయాలంటే ఒక మనిషి కావాలి. అలా వంద డ్రోన్లు పనిచేయాలంటే వందమంది కావాలి. మ్యాన్ పవర్ తగ్గేలా చేయాలనేది మాకొచ్చిన ఆలోచన. ఆ ప్రయత్నంలో స్వామ్ డ్రోన్ టెక్నాలజీని కనుగొన్నాం. ఈ విధానంలో ఒక డ్రోన్ ఇతర డ్రోన్లన్నింటినీ నడుపుతుంది. మాస్టర్ డ్రోనుకు కమాండ్స్ ఇస్తే అదే మిగిలిన డ్రోన్లకు వాటిని పంపుతుంది. ఇలా ఒక్క మనిషే అనేక డ్రోన్లు ఆపరేట్ చయవచ్చు. - విజ్ఞాన్ విద్యార్థులు

స్వదేశీ టెక్నాలజీతో డ్రోన్ చేశాం

ఉత్తరాంధ్రకు చెందిన ఆరుగురం స్నేహితులం. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ కేంద్రంగా 2018లో 15 లక్షల పెట్టుబడితో డ్రోన్లు తయారుచేయడం మొదలుపెట్టాం. తొలిగా నిఘా డ్రోన్లు తయారుచేసి ఆర్మీకి అందజేశాం. కరోనా తర్వాత అగ్రో బేస్ద్ డ్రోన్లపై దృష్టిపెట్టి ఒక డ్రోన్ తయారు చేశాం. దానికి ప్రభుత్వ అనుమతి కూడా లభించింది. ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధం చేశాం. చైనా డ్రోన్లకు భిన్నంగా దేశీయ పరికరాలతో డ్రోన్లు రూపొందించాం. ఒకసారి ఫ్యూయల్ తీసుకుంటే పది సార్లు, పది ఎకరాలు ఎరువులు, మందులు పిచికారీ చేయవచ్చు. గడిచిన 3 నెలల్లో 200 యూనిట్లు విక్రయించాం. అమ్మకాలు 8 కోట్లకు చేరాయి. ఈ ఏడాది 15 కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నాం.

- తులసీరామ్, ఎరైస్ సొల్యూషన్స్



స్థానిక సంస్థలకు మొండిచేయి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సకాలంలో నిధులు జమకాక స్థానిక సంస్థలైన పంచాయతీలు, మున్సిపాల్టీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పల్లెల్లో పారిశుధ్య పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. మున్సిపాల్టీల్లో సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. చివరకు దస్తావేజు రుసుంలోనూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం మొండిచేయి చూపుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,172 పంచాయతీలు, 17 పురపాలక సంఘాలకు సర్‌చార్జి సకాలంలో విడుదల కావడంలేదు. ఇల్లు, స్థలం, పొలం, అపార్ట్‌మెంట్ల క్రయవిక్రయాలు జరిగితే స్టాంపుడ్యూటీ సర్‌చార్జి స్థానిక సంస్థల ఖాతాలకు జమచేయాలి. ఉదాహరణకు ఒక స్థిరాస్తి రూ.కోటికి విక్రయాలు జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ1.5 లక్షలు ఆ పరిధిలోని పంచాయతీ లేదా మున్సిపాల్టీ ఖాతాకు జమ చేయాలి. అయితే ఆ ప్రకారం జరగడంలేదు. గుంటూరు జిల్లాలో అధిక శాతం స్థానిక సంస్థలకు ఏడాదిగా చెల్లింపులు జరగలేదు. పల్నాడు, బాపట్ల జిల్లాలో ఆరు నెలల వరకు సర్‌చార్జి జమకాలేదని ప్రజాప్రతినిధులు తెలిపారు. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి ద్వారా ఒక్కో జిల్లాలో ఆయా స్థానిక సంస్థలకు రూ.కోట్లల్లో నిధులు జమకావాలి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు, ఒక్కో వంతు జడ్పీ, మండల ప్రజాపరిషత్తులకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఈ ప్రక్రియలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. సర్‌చార్జి నిధులతో స్థానిక సంస్థల్లో అనేక అభివృద్ధి పనులు చేయడానికి వెసులుబాటు ఉంటుంది. మున్సిపాల్టీలకు దస్తావేజుల రుసుం నిలిచిపోవడంతో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక.. కొత్తగా ప్రగతి పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. సర్‌చార్జికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రొసీడింగ్స్ పంపించకపోవడానికి ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడమేనని సమాచారం. కొంతమంది సర్పంచులు, పురపాలకులు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరిగి స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి జమ చేయాలని కోరుతున్నా ఫలితం ఉండటంలేదు.

స్థానిక సంస్థలను ఆదుకోవాలి

స్థానిక సంస్థలకు దస్తావేజు రుసుం వెను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి చెల్లిస్తే గ్రామాల్లో నీటి సరఫరా, పారిశుధ్య పనులకు, కార్మికుల జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులుబాబు ఉంటుందన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

మంగళగిరి ఆస్పత్రి అప్‌గ్రేడ్

- వంద పడకల వైద్యశాలగా అభివృద్ధికి ఆమోదం
- రూ.52 కోట్లు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం
- హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్.. ప్రజల హర్షం
- నాడు ఎన్టీఆర్ హయాంలో నిర్మాణం.. నేడు లోకేశ్ నేతృత్వంలో అభివృద్ధికి అడుగులు

మంగళగిరి, మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రికి మంచి రోజులొచ్చాయి. 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని వంద పడకల సమగ్ర ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు ఏపీ కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఆస్పత్రి అభివృద్ధికి రూ.52 కోట్లను మంజూరు చేస్తూ నిర్ణయించింది. ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంగళగిరి నుంచి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న స్వర్గీయ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటైంది. ఏప్రిల్ 9, 1986లో ఆస్పత్రికి శంకుస్థాపన చేయగా, ఏప్రిల్ 20, 1989న ప్రారంభించారు. దశాబ్దాలు ప్రజలకు వైద్య సేవలందించిన మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల ఆ తర్వాతి కాలంలో పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. భవనం పూర్తిగా శిథిలమైనా పట్టించుకున్న నాథుడు లేడు. ఆ తర్వాత మంగళగిరిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలనే డిమాండ్ తెరమీదికి వచ్చింది. ఈ క్రమంలోనే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరిలో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మితమైంది. దీంతో మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు డిమాండ్లు తెరమరుగయ్యాయి. ఎయిమ్స్ ఉండగా ఇంక ప్రభుత్వ ఆస్పత్రితో పనేముందంటూ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఎయిమ్స్‌లో వైద్య సేవలు పొందాలంటే స్థానికులకే తలకు మించిన భారంగా మారింది. దీంతో మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన మళ్లీ తెరమీదికి వచ్చింది. ఎన్నికల ముందు మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితిని, స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న లోకేశ్ అధికారంలోకి వస్తే వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కేవలం నాలుగు నెలల్లోనే మంత్రి నారా లోకేశ్ నెరవేర్చడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు ఎన్టీఆర్ హయాంలో ఆస్పత్రి నిర్మాణంగా కాగా.. మళ్లీ నేడు ఆయన మనుమడు లోకేశ్ సారధ్యంలో అధునాతనంగా రూపుదాల్చనుం డడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కేకు కట్ చేస్తున్న ప్రజారోగ్య వేదిక, వంద పడకల సమగ్ర ఆస్పత్రి సాధన కమిటీ ప్రతినిధులు

ప్రజారోగ్య వేదిక ప్రతినిధుల హర్షం

మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల సమగ్ర ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు ఏపీ కేబినెట్ తీర్మానం చేయడంపై ప్రజారోగ్య వేదిక, వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రి సాధన కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో బాణాసంచా కాల్చి, కేకును కట్ చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ ఆస్పత్రి విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి పునర్నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి పేదలకు వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, కోరారు. మంగళగిరి ఆస్పత్రిని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు హర్షం వ్యక్తం చేశారు.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!



ఆర్జేడీ కార్యాలయం

- డిగ్రీ కళాశాలల్లో నిర్దేశించిన దానికంటే డబుల్ వసూళ్లు
- ఒక్కో విద్యార్థికి అదనంగా రూ. 20 వేలు భారం
- ప్రేక్షక పాత్రలో ఆర్‌జేడీ కార్యాలయ అధికారులు

గుంటూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో యాజమాన్యాలు వసూలు చేసే ఫీజుల దందాకు విద్యార్థులు హడలిపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తూ విద్యార్థులను గుల్ల చేస్తున్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో జరిగే ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అక్రమ ఫీజుల దందాలో వారు కూడా భాగస్వాములు

(మిగతా 6వ పేజీలో)

మాయా బజార్!

- సెకండ్ హ్యాండ్, స్పేర్ పార్టుల కాణాచి మాయాబజార్
- గుంటూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సముదాయం
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఓల్డ్ మోటార్ మార్కెట్
- చుట్టుపక్కల నాలుగు జిల్లాలకు అదే కేరాఫ్ అడ్రస్
- ఇక్కడ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన లాల్‌జాన్ బాషా



ద్విచక్రవాహనాలు, స్పేర్‌పార్టులు అమ్మే దుకాణాలు

8

సహన మృతి బాధాకరం

కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి రూ.10లక్షలు ఆర్థికసాయం

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సహన కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతున్న మంత్రి మనోహర్

నేటి నుంచి వర్సిటీలో యువజనోత్సవాలు

పెదకాకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నేటి నుంచి యువజన ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ రిజిస్టర్ ఆచార్య సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువజనోత్సవాల నిర్వహణకు కోఆర్డినేటర్‌గా ఆచార్య మురళీమోహన నియమించామన్నారు. వర్సిటీ పరిధిలోని అనేక కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - సాతులూరు రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం రాత్రి పట్టణంలోని క్రిష్టియన్‌పాలెం వద్ద ఓ వ్యక్తి తనంతట తానుగా అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు నరసరావుపేట రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు నాయక్ బుధవారం తెలిపారు. మృతుడి వద్ద విజయవాడ - నరసరావుపేట రైల్వే ప్రయాణ టిక్కెట్ ఉందన్నారు. మృతుడు నలుపు రంగు పొడుగు చేతుల చొక్కా, నలుపు రంగు కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసు స్టేషన్ ఎస్‌ఐని సంప్రదించాలని కోరారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటి మట్టం బుధవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 48,284 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,284 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,269 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు.

ఉపాధి రికార్డులు ఏవీ?

- ఏడు నెలలు గడిచినా.. ఏడు రోజులు గడువు కావాలంట
- ఆడిట్ బృందానికి చుక్కలు చూపిస్తున్న ఉద్యోగులు
- ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన సామాజిక తనిఖీలు
- నిధులు స్వాహా చేశారేమోనని అనుమానం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

నకరికల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను స్వాహా చేశారు. రికార్డులను అప్పగించటానికి మాత్రం వారం రోజులు గడువు కావాలంటూ ఉపాధి ఉద్యోగులు కోరారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఏడు నెలలు గడుస్తున్నా రికార్డులు సమర్పించటానికి గడువు కోరటం సామాజిక తనిఖీ బృందాలకు అక్రమాలు జరిగాయనే అనుమానాలు బలపడుతున్నాయి. సకాలంలో రికార్డులు అందజేయలేదని సామాజిక తనిఖీ బృందం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ మండలంలోకి రెండుసార్లు సామాజిక తనిఖీ బృందాలు వచ్చి వెళ్లాయి. వివరాల్లోకి వెళ్తే.. గత ఆర్థిక సంవత్సరంలో అతి తక్కువ నమోదయ్యే నకరికల్లు మండలంలో అతి ఎక్కువ పని దినాలు నమోదు అయ్యాయి. ఇదంతా రికార్డుల సృష్టే తప్పా క్షేత్ర స్థాయిలో పనులు జరగలేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఉపాధి హామీలో పని చేస్తున్న ఉద్యోగులు కొందరు కొన్నేళ్లుగా ఇక్కడే ఉండటం వలన అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

గ్రామాల వారీగా నిధుల వినియోగం

కాగా గ్రామాల వారీగా గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంకలగుంటలో రూ. 1,40,20,881, జల్లాపేట తండా రూ.5,44,984, గుండ్లపల్లి రూ. 1,25,77,018, బాలాజీ నగర్ తండా రూ.15,61,382, నకరికల్లు రూ. 1,02,68,969, శివాపురం తండా రూ.8,06,682, దేచవరం రూ.33,80,340, చేజర్ల రూ. 98,86,551, చాగల్లు రూ.39,32,945, చీమలమర్రి రూ. 70,84,405, త్రిపురాపురం రూ.32,82,261, రూపెనగుంట్ల రూ.58,23,343, తురకపాలెం రూ.40,37,342, చల్లగుండ్ల రూ.56,07,0277, కండ్లకుంట రూ.36,25,811, అడ్డరోడ్డు రూ.22,51,089, నరసింగపాడు రూ.38,86,384 రూపాయలుగా ఉపాధి నిధులను వినియోగించినట్లు సామాజిక తనిఖీ బృందాలకు లెక్కగా చూపారు.

పని దినాలు ఇలా..

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూలీలకు చెల్లింపుల కింద రూ.7.82 కోట్లు, మెటీరియల్ కింద రూ.2 కోట్ల మేర ఖర్చులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. మూడు రోజుల క్రితం ఆడిట్ బృందాలు తనిఖీకి వచ్చినా ఉపాధి ఉద్యోగులు రికార్డులు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారని ఆడిట్ బృందాలు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గ్రామాల వారీగా అత్యధికంగా కుంకలగుంటలో 52,088 పని దినాలు, గుండ్లపల్లిలో 46,214, నకరికల్లులో 35,100, చేజర్లలో 31,501, చీమలమర్రిలో 28,490, రూపెనగుంట్లలో 24,083, చల్లగుండ్లలో 18,900, కండ్లకుంట 14,959, తురకపాలెంలో 13,660, చాగల్లు 11,681, త్రిపురాపురం 11,217, దేచవరం 10,161, అడ్డరోడ్డు 9,295, నరసింగపాడు 8,452, బాలాజీ నగర్ తండా 6,481, శివాపురం తండా 2,733, జల్లాపేట తండా 2,518 పని దినాలు మొత్తంగా 3,27,533 పని దినాలు నకరికల్లు మండలంలో నమోదయ్యాయి.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు గుర్తిస్తే అందుకు బాధ్యులైన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధా లింగమూర్తి తెలిపారు. సామాజిక తనిఖీలు వాయిదా పడిన విషయం గురించి మాట్లాడుతూ రికార్డులు అందజేయకపోవటం, సిబ్బంది అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో సామాజిక తనిఖీ బృందాలను వేరే మండలాలకు పంపించినట్లు తెలిపారు. రికార్డులు ఇవ్వని, అక్రమాలకు బాధ్యులైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కుపైగా ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు దాదాపు 24 వేల మంది ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోనూ ఫీజుల్ని నిర్దేశించారు. సాధారణ కోర్సులకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు, బీఎస్సీ కంప్యూటర్, ఇతర కోర్సులకు రూ. 18 వేల వరకు ఫీజులు నిర్దేశించారు. ఇంతకు మించి అదనంగా ఫీజులు వసూలు చేయకూడదని ఉన్నా, యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే డబుల్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే.. వేధింపులు

గుంటూరు నగరం నడిబొడ్డున్న ఉండి సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పుకునే కళాశాలల్లో ఇటీవల భారీ మొత్తంలో అదనంగా ఫీజులు వసూలు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.20 వేలకుపైగా ఫీజులు వసూలు చేశారు. దీనికి ల్యాబ్, ఎగ్జామినేషన్ ఫీజులు అదనంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికే రెండుసార్లు ఆర్‌జేడీ కార్యాలయంలో, మరో రెండు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా యాజమాన్యంలో మార్పురాలేదు సరికదా ఫిర్యాదు చేసిన విద్యార్థులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


అదనపు ఫీజులకు నిరసనగా ఇటీవల నగరంలోని ఓ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నిరసన (పాత చిత్రం)

- నగరంలో మహిళల కోసం ఉన్న ఒక అన్‌ఎయిడెడ్ కళాశాలలో కూడా ఇష్టారాజ్యంగా ఫీజులు దందా నడుస్తోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకున్నా ఫీజులు మాత్రం భారీగానే ఉంటున్నాయి. యాజమాన్యాలు చెప్పిందే ఫీజు అంటూ వసూళ్ల పర్వం సాగుతోంది. దీనికి అరకొర వసతులతో హాస్టల్ నిర్వహిస్తూ ఫీజులు దండుకుంటున్నారు. ఇక్కడ కళాశాలకు గ్రౌండ్, ఇతర మౌలిక వసతులు లేకున్నా భారీ సంఖ్యలో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. ఫీజుల భారం, కళాశాల యాజమాన్యం వేధింపులతో ఓ విద్యార్థిని మూడోఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- బ్రాడీపేట ప్రాంతాల్లో ఉన్న మూడు అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఫీజుల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఓ కళాశాల కరస్పాండెంట్ ఒకే ప్రాంగణంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, హాస్టల్ నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో ఇదే ప్రాంగణంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- తెనాలి, నరసరావుపేట, మాచర్ల ప్రాంతాల్లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్ని గత ఐదేళ్లలో ఏనాడు ఉన్నత విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసిన సంఘటనలు లేవు. పల్నాడులో ఎక్కడ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి అనే విషయం కూడా ఆర్‌జేడీ కార్యాలయం అధికారులకు తెలియని పరిస్థితి.

ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు

జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు చెల్లించే ఎగ్జామినేషన్ ఫీజుతోపాటు, సర్టిఫికెట్లు జారీ సమయంలో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాల అభివృద్ధి పేరుతో కొన్ని చోట్ల అదనపు దోపిడీ సాగుతోంది.

బాలిక మృతిపై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెనాలి బాలిక మృతి ఘటనపై గుంటూరులో జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. బుధవారం గుంటూరులోని తన పార్టీ కార్యాలయం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రమ్య, ఆరుద్ర హత్యలు సందర్భంగా పర్యటనకు వచ్చిన లోకేష్, మాపై గతంలో కేసులు పెట్టారని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, జగన్ ఇంకా ముఖ్యమంత్రిగానే ఊహించుకుంటున్నారని అన్నారు. మేము బాధితులను పరామర్శించడానికి వెళ్తే వాళ్ల కార్యకర్తలను పంపించి ఆందోళన చేయించారన్నారు. ఈ రోజు ఎన్డీయే ప్రభుత్వంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జగన్ హెలికాప్టర్‌లో దిగారని, గత ప్రభుత్వంలో హత్యలు, అత్యాచారాలు చేసిన వ్యక్తులను కాపాడిన వ్యక్తి జగన్ అన్నారు. తాడేపల్లి జగన్ ప్యాలెస్ దగ్గర జరిగిన ఘటనలో వేణుగోపాల్ రెడ్డిని జగన్ కాపాడారని, వాలంటీర్లు, ఒంటరి మహిళలపై అఘాయిత్యాలు చేస్తే జగన్ పట్టించుకోన్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఘటనల్లో బాధితులను జగన్ ఎందుకు పరామర్శించలేదన్నారు. గత ప్రభుత్వంలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా హత్యలు, హత్యాచారాలు జరిగాయన్నారు. ప్రస్తుత ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, బాధితులకు అండగా నిలబడి, నిందితులను వెంటనే అరెస్టు చేసిందన్నారు. జగన్ అరాచకాలకి సపోర్ట్ చేసిన అధికారులు ఈ రోజు కేసుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. జగన్ పెంచి పోషించిన అసాంఘిక కార్యకలాపాలు, వ్యక్తులు, గంజాయి వలన సమాజంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. బాధిత మహిళపై జరిగిన దాడి విషయంలో చెప్పకూడని అంశాలు మీడియా ముందుకు వచ్చి జగన్ మాట్లాడారని, ఇది చాలా తప్పని అన్నారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ పనితీరు శూన్యమని, దిశా పేరుపై జగన్ డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. దిశా యాప్‌ని బలవంతంగా ఫోన్లో డౌన్లోడ్ చేయించారని, దిశా యాప్ ఉంటే ఎందుకు గత ప్రభుత్వంలో మహిళలపై దాడులు జరిగాయని విమర్శించారు.

వారంలోపే రిటర్నబుల్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు

తుళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)కు భూ సమీకరణ పథకంలో భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదేశానుసారం వారం లోపు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసే ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ రైతులకు తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు సంబంధిత అథారిటీ ఎక్కడా అంతరాయం లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. గతంలో రిటర్నబుల్ ప్లాట్లు పొందని రైతులకు బుధవారం విజయవాడ ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ లాటరీ నిర్వహించారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రైలర్ రన్ వేసి, తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టారు. లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు సంబంధిత అధికారులు ప్లాట్లు కేటాయింపు పత్రాలను అందజేశారు. అమరావతిలోని ఎల్పీఎస్ లే అవుట్‌లకు మౌలిక సదుపాయాల పనులు డిసెంబరు నుంచి ప్రారంభం అవుతాయన్నారు. లాటరీ అనంతరం ప్లాట్లు అందుకున్న రైతులకు సీఆర్డీఏ జీఐఎస్ బృందం ఆయా గ్రామాల మ్యాప్‌ల ద్వారా కేటాయించిన ప్లాట్ల ప్రదేశాన్ని వివరించారు. తొలి రోజు జరిగిన ఈ లాటరీలో తొమ్మిది గ్రామాలకుగానూ 23 మంది రైతులకు 68 రిటర్నబుల్ ప్లాట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ఎస్. రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్ రాజు, ఎం.విశ్వేశ్వర నాయుడు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


లాటరీలో ప్లాట్లు పొందిన వారికి పత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్

నేడు లాటరీ జరగనున్న గ్రామాలు..

గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నవులూరు, నిడమర్రు 1, 2 రైతులకు లాటరీ తీస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బోరుపాలెం, రాయపూడి, నెక్కల్లు, నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం రైతులకు లాటరీ తీస్తారని అధికారులు తెలిపారు.

రూ.61 లక్షల ఆస్తి సేవా సంస్థలకు దానం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్టా రాజ్యలక్ష్మి చిరస్మరణీయురాలని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో కమిషనర్ చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు చెక్కులు అందజేశారు. అనంతరం కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గజిటెడ్ అధికారిగా సమర్థవంతమైన సేవలు అందించి, ఇప్పుడు మానవత్వం కలిగిన మనిషిగా ఆమె కీర్తి గడించారని కొనియాడారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ చారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, షిరిడీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్టా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటు చేసుకున్న మెమోరియల్ ట్రస్ట్‌కు రూ. 36 లక్షలు చెక్కుల రూపంలో రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో, ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్ లకు కమిషనర్ అందజేశారు. రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్ కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, సూపరింటెండెంట్లు సీహెచ్ వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్ ఈశ్వర్, యుగంధర్, మూర్తి పెన్షనర్ల సంఘం తరుపున వివేకానంద, పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా రైళ్ల టిక్కెట్లు

- సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో నగదు రహిత లావాదేవీలను అన్ని స్థాయిల్లో ప్రోత్సహిస్తున్నాం. డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకొని ప్రయాణికులకు వివిధ సేవలను సులభతరం చేస్తున్నామని గుంటూరు రైల్వే డివిజనల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో యూటీఎస్ యాప్, డిజిటల్ చెల్లింపులపై ఫటాఫట్.



యూటీఎస్ యాప్ వినియోగించి ఎంతశాతం మంది ప్రయాణికులు టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొంటున్నారు?

ఎస్.డీసీఎం: యూటీఎస్(అన్ రిజర్వుడ్ టిక్కెటింగ్ సిస్టమ్) యాప్ వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది. డివిజనల్‌లో జనరల్ టిక్కెట్లలో 7 శాతం యూటీఎస్ యాప్ ద్వారా బుకింగ్ జరుగుతున్నాయి.

రైల్వేబోర్డు యూటీఎస్ యాప్‌లో టిక్కెట్ల బుకింగ్‌కు ఎంత శాతం లక్ష్యాన్ని నిర్దేశించింది?

ఎస్.డీసీఎం: రైల్వేబోర్డు మొత్తంగా ఏడాదికి 14 శాతం యూటీఎస్ యాప్ ద్వారా టిక్కెట్‌లు బుకింగ్ జరిగేలా చూడాలని లక్ష్యం పెట్టింది. ఇందుకోసం అన్ని రైల్వేస్టేషన్లు, రైళ్లలో కమర్షియల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలానే డ్రైవ్‌లు కూడా చేపడుతున్నాం.

యూటీఎస్ యాప్ ద్వారా ఎన్ని కిలోమీటర్ల దూరం నుంచి టిక్కెట్ బుకింగ్ చేసుకోవచ్చు?

ఎస్.డీసీఎం: యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు 50 కిలోమీటర్ల దూరం నుంచే జనరల్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవచ్చు. గ్రామం/ఇంటి వద్దనే యాప్‌లో టిక్కెట్ బుకింగ్ చేసుకొని రైల్వేస్టేషన్‌లో నేరుగా రైలు ఎక్కేయొచ్చు. క్యూలైన్లలో నిలుచోవాల్సిన పని ఉండదు.

యూటీఎస్ యాప్ వినియోగించే వారికి ప్రోత్సాహం ఏమైనా ఇస్తున్నారా?

ఎస్.డీసీఎం: యూటీఎస్ యాప్‌లో ఆర్ వ్యాలెట్ ద్వారా నగదు రీఛార్జ్ చేసుకొంటే 3 శాతం బోనస్ వస్తుంది.

యూపీఐ ద్వారా చెల్లింపులకు అవకాశం కల్పిస్తున్నారా?

ఎస్.డీసీఎం: రైల్వేస్టేషన్లలో కౌంటర్ల వద్ద టిక్కెట్‌లు తీసుకొనేవారు ఏ యూపీఐ యాప్(జీపే, ఫోన్‌పే, పేటీఎం, మొబిక్విక్ వంటి వాటి) ద్వారా క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదు చెల్లించి టిక్కెట్‌ని పొందవచ్చు. దీని వలన చిల్లర కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి.

జిల్లా పరిషత్ బకాయిలు విడుదల చేస్తాం

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర దంపతులకు సీఎం హామీ


సీఎం చంద్రబాబు నాయుడుతో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు అన్నీ వెంటనే విడుదల చేయిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్ దంపతులకు హామీ ఇచ్చారు. కత్తెర దంపతులు సీఎం కార్యాలయంలో చంద్రబాబు నాయుడుని కలిసి జడ్పీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిషత్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరగా, బిల్డింగ్ నిర్మించి ఎన్ని సంవత్సరాలు అయ్యిందని చంద్రబాబు చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. అందుకు ఆమె 70 ఏళ్లు అయ్యిందని చెప్పటంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. మూడేళ్లుగా వాహనం లేకుండా ఉన్నానని చైర్‌పర్సన్ చెప్పటంతో, వెంటనే వాహనాన్ని కేటాయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరికొన్ని సమస్యలను సీఎంకు వివరించగా సంబంధిత అధికారులకు సీఎం వెంటనే ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

డయేరియా లక్షణాలతో కాలేజి విద్యార్థి మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డయేరియా లక్షణాలతో కాలేజి విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం అంజనాపురం కాలనీలో చోటు చేసుకుంది. మృతుని తల్లిదండ్రులు తమ్మిశెట్టి కృష్ణారావు, శివకుమారి తెలిపిన వివరాల మేరకు.. మృతుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21) మాచర్లలోని డిగ్రీ కళాశాలలో బి.కాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఉండగా నారాయణపురంలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పిడుగురాళ్లకు తరలించి అక్కడి నుంచి నరసరావుపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు కృష్ణారావు, శివకుమారి క్వారీ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడం తల్లిదండ్రుల్లో తీరని శోకాన్ని నింపింది. మృతునికి తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. అంతేకాకుండా అంజనాపురం కాలనీలో నివాసముంటున్న బండారు చినవీరయ్య, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, దేవళ్ల సైదులు, శాంతమ్మలు డయేరియా బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరు దాచేపల్లి, పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు భారతీయ విద్యాభవన్ విద్యార్థి

గుంటూరు(విద్య),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 18,19తేదీల్లో కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ విద్యార్థి సత్తాచాటినట్లు కార్యదర్శి పి.రామచంద్రరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ విద్యాభవన్‌లో 6వ తరగతి చదువుతున్న యంగలశెట్టి జెనీస్ విశ్వసాయి పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. జెనీస్‌ని ప్రిన్సిపల్ ఎస్ హేమాంబ, కోచ్ ఇమ్రాన్‌ఖాన్ అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

29,340 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 31,357 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 29,340 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,629 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8200	16200	334	8500	16000
నెంబరు.5	8500	16000	నెంబరు. 5	10500	12000
273	11000	13500	273	13000	14000
341	9000	16000	341	10000	16500
4884	12000	13800	4884	11500	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18600	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	9000	16000	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

గుంటూరు సిటీ వార్తలు

సహన మృతి ఘటనలో నిందితులను శిక్షించండి

● వామ పక్షాల నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన మధిర సహనా మృతికి కారణమైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జీజీ హెచ్ శవాగారం వద్ద మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి, ఆమె మృతదేహానికి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,. నిందితుడు నవీన్‌ను విచారించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి, ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. పరామర్శించిన వారిలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, పాశం రామారావు, ఎస్ భావన్నారాయణ, కే నళినికాంత్, కాకుమాను నాగేశ్వరరావు, బీ సూరిబాబు, వైకృష్ణ, అకిటి అరుణ్ కుమార్ ఉన్నారు.

విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి

● ఎస్ఎఫ్ఐ డిమాండ్

గుంటూరు(విద్య),అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం, రెడ్డిపాలెంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో ఎనిమిదో విద్యార్థిని అనుమానా స్పదస్థితిలో మృతి చెందడంపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం .కిరణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీఈఓ పి.శైలజకు వినతిపత్రం అందజేశారు. ఆ స్కూల్ హాస్టల్లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థిని మంగళవారం రాత్రి గదిలో ఉన్న ఫ్యాన్ కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. అయితే, దీనిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, విద్యార్థిని మృతిపై విచారణ జరిపి, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ స్కూల్ పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చదువుపేరుతో విద్యా ర్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్,జిల్లా సహాయక కార్యదర్శి యశ్వంత్,పవన్ పాల్గొన్నారు.

వలస కార్మికులకు చట్టాలు అమలు చేయండి

గుంటూరు(తూర్పు),అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వలస కార్మికులను గుర్తించి, వారికి కార్మిక చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సంజీవయ్యనగర్‌లో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సంఘ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఇంతవరకూ అమలు చేయలేదని అన్నారు. సంఘ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు మాట్లాడుతూ ఇసుక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కి వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

శివతాండవం నృత్య పోటీలో సీతారామయ్య స్కూల్ విద్యార్థి రికార్డు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): శివతాండవం నృత్య పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి తుమ్మూరు జ్ఞానితి ప్రపంచ స్థాయిలో 10 రికార్డ్‌ను సాధించింది. ఈ విషయాన్ని సెక్రెటరీ అండ్ కరె స్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ బుధవారం తెలిపారు. ఐసీఎండీఏ (ఇంటర్నేషనల్ కర్ణా టక మ్యూజిక్ అండ్ డాన్సర్ అసోసియేషన్) ఈ నెల 17న శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యతోపాటు శాస్త్రీయ నృత్య శిక్షణకు తమ పాఠశాల ప్రాధాన్యం ఇస్తోందని, , ఈ రికార్డులే అందుకు ఉదాహరణ అని విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

డ్రెయిన్ పారక .. సమస్యలు ఆగక..

● చిత్రవిచిత్రంగా చుట్టుగుంట- శ్రీరామ్‌నగర్ వద్ద డ్రెయిన్
● వైసీపీ హయాంలో రూ. 1.50 కోట్లు ఖర్చు.. ఫలితం శూన్యం
● వర్షమొస్తే..సాయినగర్, శ్రీలక్ష్మీనగర్‌తో పాటు నాలుగు కాలనీల్లో సమస్యలు

గుంటూరు (విద్య),అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆ డ్రెయిన్‌కు ఒక చోట సైడ్‌వాల్ ఉండదు, మరోచోట సైడ్‌వాల్ ఉన్నా ఇరుకుగా ఉంటుంది, ఇంకో చోట రెండు కాల్వలుగా విడిపోతుంది. ఇలాంటి చిత్రవిచిత్ర నిర్మాణపు డ్రెయిన్ ఎక్కడో లేదు.. చుట్టుగుంట రైతు బజారు వద్ద నుంచి శ్రీరామ్‌నగర్ మెయిన్ రోడ్డు వద్ద కనిపిస్తుంది.

గత ప్రభుత్వ హయాంలో శ్రీరామ్‌నగర్ హిందూ శ్మశాన వాటిక నుంచి చుట్టుగుంట వరకు డ్రెయిన్ నిర్మాణం సక్రమంగానే ఉంది. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రీమోడల్ పేరుతో చేసిన పనుల కారణంగా ప్రస్తుతం ఈ డ్రెయిన్ ఎందుకు పనికి రాకుండా పోయింది. కేవలం కాసుల కోసం కక్కుర్తి పడి డ్రెయిన్ రీమోడల్ కోసం రూ. 1.50 కోట్లు ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి దారుణంగా ఉంటుంది. కాలనీలను వరదనీరు ముంచెత్తుతుండటంతో డ్రెయిన్ పక్కనే ఉన్న కాలనీలు సాయి నగర్, శ్రీలక్ష్మీనగర్, దుర్గానగర్, కొత్తకాలనీ, హనుమాన్‌నగర్, శ్రీరామ్‌నగర్ ప్రజలకు ఇబ్బందులు తప్పట్లేదు.


మురుగునీరు ప్రవహించక పోవడంతో పేరుకుపోయిన వ్యర్థాలు

డ్రెయిన్‌లో పారుదల సక్రమంగా ఉండేందుకు, వరద నీరు ముంచెత్తకుండా ఉండాలన్నా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.


చుట్టుగుంట రైతు బజారు వద్ద ఇరుకుగా ఉన్న డ్రెయిన్


భారతి పెట్రోల్ బంకు వద్ద సైడ్‌వాల్ లేని డ్రెయిన్


శ్రీ లక్ష్మీనగర్‌లో వరద నీరు (పాత చిత్రం)


చుట్టుగుంట అన్న క్యాంటీన్ వద్ద ఇరువైపులా డ్రెయిన్ పూడుకుపోయిన దృశ్యం


భారతి పెట్రోల్ బంకు దాటిన తరువాత రెండుగా విడిపోయిన డ్రెయిన్


ఓవర్ బ్రిడ్జి సమస్యపై కేంద్రమంత్రి పెమ్మసానికి, మాజీ మంత్రి ఆలపాటి రాజాతో కలిసి వివరిస్తున్న బిల్డింగ్ ఓనర్స్, షాప్ కీపర్స్ అసోసియేషన్ నాయకులు

ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో నష్టం కలగకుండా చూస్తా

● బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని హామీ

గుంటూరు సిటీ, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట సమీపంలో కొత్తగా రానున్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వలన ఏ ఒక్కరికి నష్టం కలగకుండా చూస్తానని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల కొంతమందికి నష్టం జరుగుతుందని అరండల్‌పేట, బ్రాడీపేట బిల్డింగ్ ఓనర్స్, షాప్ కీపర్స్ అసోసియేషన్ నాయకులు పెమ్మసాని దృష్టికి తీసుకువచ్చారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి ఓవర్ బ్రిడ్జి డిజైన్ గురించి సంబంధిత సాంకేతిక సిబ్బందితో చర్చిస్తామని, ప్రజలు, వ్యాపారస్తుల నుండి అభిప్రాయాలను కూడా సేకరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం వచ్చిన డిజైన్‌తో బ్రిడ్జి నిర్మిస్తే చాలా షాపులు తొలగించాల్సి వస్తుందని, వ్యాపారులు నష్టపోతారని కేంద్ర మంత్రికి వివరించారు. అసోసియేషన్ నిర్వాహకులు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ స్థానిక బ్రాడీపేట 14 వద్ద గేటు ఏర్పాటు చేయటం, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించడం ద్వారా సమస్యలు ఉండవని మంత్రితో చెప్పారు. మట్టుపల్లి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ డొంక రోడ్డు వద్ద ఉన్న మూడు వంతెనల మార్గాన్ని విస్తరించడం వలన కూడా నగర ప్రజల ట్రాఫిక్ సమస్య తీరుతుందని తెలిపారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వలన తలెత్తే సమస్యలపై పెమ్మసానికి అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మట్టుపల్లి హరీష్ , నారాయణమూర్తి, సుబ్బారావు వివరించారు.


కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ నేతల సన్మానం

గుంటూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని గుంటూరు జిల్లా బీజేపీ నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. ఒక ప్రైవేట్ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గుంటూరుకు వచ్చిన ఆయనను స్థానిక బీజేపీ నేతలు కలిశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, వల్లూరు జయప్రకాష్ నారాయణ, యడ్లపాటి స్వరూపరాణి, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్‌ని గెలిపించాలి

● ఎస్‌సీఆర్ఎంయూ జోనల్ కార్యదర్శి శంకరరావు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం పోరాడే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌ని రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎస్‌సీఆర్ఎంయూ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో యూనియన్ డివిజనల్ నాయకులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి ఎంవీ ప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

● డాక్టర్ రామ్మూర్ధ్ వెలమాటి

పెదకాకాని, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు అన్ని రంగాలలో నిష్ణాతులు కావాలని, పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించి భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాలని గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్ఫర్మేషన్ (జి.ఎఫ్.ఎస్.టి) వైస్ చైర్మన్ డాక్టర్ రామ్నాథ్ వెలమాటి అన్నారు.వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విజన్-2047 సదస్సుకు ముఖ్యవక్తగా ఆయన పాల్గొన్నారు.రామ్నాథ్ మాట్లడుతూ ప్రస్తుతం దేశంలో యువతకు అవకాశాలు అరుదుగా ఉన్నాయని వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే 25 సంవత్సరాలు దేశ అభివృద్ధిలో కీలకమని, విద్యార్థులు అధునిక నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. యువత వ్యాపారవేత్తలుగా ఎదగటానికి విజన్ 2047లో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో భారత్ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న ఆశాభావం వ్యక్త పరిచారు. అనంతరం డాక్టర్ రామ్ నాథ్ వెలమాటి, శాఖమూరు శ్రీనివాస్ ప్రసాద్ ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ సూర్యదేవర బదరి ప్రసాద్ సత్కరించారు.


డాక్టర్ రామ్నాథ్ వెలమాటి కి సరస్వతి దేవి జ్ఞాపకం అందజేస్తున్న చైర్మన్ విద్యాసాగర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజా, ఎమ్మెల్యే మాధవి తదితరులు

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ మాటలు

● ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలి యువతి సహన ఘటనపై పరామర్శకు వచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడిన మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఏపీ లెథర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ నేతలతో కలిసి నిర్వహించిన లేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆలపాటి మాట్లాడుతూ పరామర్శల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడని విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్ పక్కన యువతి చనిపోతే గత ఐదేళ్లలో పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మానవత్వంతో మాట్లాడాలని, రాజకీయ లబ్ధి కోసం మాట్లాడడం జగన్‌రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నిందితుడు తన పార్టీ నేత అని, మృతురాలి తల్లి స్వయంగా మీడియా ముందు చెప్పిన విషయం జగన్ తెలుసుకోకుండా, అడ్డగోలు వాదన చేస్తున్నారని విమర్శించారు. లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ ఏపీలో పులివెందుల ప్రేతాత్మ తిరుగుతోందని ఎద్దేవా చేశారు. తన పాలనలో మహిళలు, దళితులు, బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోని వ్యక్తి ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో సీహెచ్ చిట్టిబాబు, ఎం.ఇమ్మానియేల్, వి. శ్రీనివాస్, బి.రామారావు, వి.శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఆర్ఆర్‌బీఈఏ నేత వెంకటేశ్వరరెడ్డి, వేదికపై అసోసియేషన్ నాయకులు

రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకులు ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధం

● అవిశ్రాంత పోరాటానికి దక్కిన ఫలితం
● ఏఐఆర్ఆర్‌బీఈ అసోసియేషన్ నేత వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవు తోందని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఆర్ఆర్‌బీఈఏ) సెక్రటరీ జనరల్ ఎస్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ప్రాంతీయ బ్యాంకుల ఉద్యోగస్తులతో అరండల్‌పేటలోని గ్రాండ్ వెంకటేష్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ కృషి వల్ల ఇతర వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఇతర అలవెన్స్‌లు కూడా సాధించామని చెప్పారు. అంతకుముందు బ్రాడీపేటలోనున్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి బ్యాంక్ చైర్మన్ కె ప్రమోద్ కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో సీజీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బోడా శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ సీహెచ్ వెంకట్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ మజీద్, సీజీజీబీ స్టాఫ్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్ యామలయ్య, కోశాధికారి మూర్తి, అధ్యక్షుడు సాగర్ తదితరులు ఉన్నారు.

విజ్ఞాన్ వర్శిటీ-ఐసీఏఆర్, ఎన్ఏఏఆర్ఎంల అవగాహన ఒప్పందం

గుంటూరు(విద్య),అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంతో హైదరాబాదులోని ఐసీఏఆర్-ఎన్ఏఏఆర్ఎం(నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి మేనేజమెంట్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఫ్యాకల్టీ ఎక్స్ ఛేంజ్, ఉమ్మడి పరిశోధనలతోపాటు డెవలప్ మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునని తెలిపారు. వీసీ ఆచార్య పి. నాగభూషణ్, ఇన్‌చార్జీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రావు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

ఉపకారవేతనాలను సద్వినియోగం చేసుకోండి

గుంటూరు(తూర్పు),అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దాతలు అందజేస్తున్న ఉపకారవేత నాలను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని కమ్మ జన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ అన్నారు. కుందుల రోడ్డులోని కమ్మ బాలి కల వసతి గృహంలో ఉప కార వేతనాల నిధికి జీవిత కాల సాహిత్య పురస్కార గ్రహీత, సేవా జ్యోతి ట్రస్ట్ చైర్మన్ మొవ్వా మృత్యుంజయరావు బుధవారం రూ.లక్ష చెక్కును ఆయనకు అందజేశారు. రమేష్ మాట్లా డుతూ ఈ విరాళాన్ని వసతి గృహంలో ఉండే ప్రతిభ కల్గిన పేద విద్యార్థులు 10 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందజేయనున్నట్టు తెలిపారు. స్థానిక జేకేసీ రోడ్డులో నూతన నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరారు.


చుక్కపల్లి రమేష్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న మొవ్వా మృత్యుంజయరావు

ప్రతి సెక్షన్‌లో ప్రతి నెలా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం చర్యలు
● గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీనివాసబాబు



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలతో పాటు రూరల్ ప్రాంతంలో విస్తరించిన గుంటూరు టౌన్-1 ఆపరేషన్ డివిజన్ పరిధిలో ప్రతి సెక్షన్ పరిధిలో ప్రతి నెలా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్ర జ్యోతి'తో మాట్లాడుతూ నిరంతరాయ విద్యుత్ సరఫరాలో భాగంగా తీసుకుంటోన్న ఈ చర్యలకు రూ.1.87 కోట్ల బడ్జెట్ ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపించినట్లు చెప్పారు.

ఫటా ఫట్

తరచూ విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఫిర్యాదు లొస్తున్నాయి..

ఈఈ : వర్షాలు, ఈదురు గాలులతో చెట్లు పడటం, ఫ్లెక్సీలు పడటంతో సాంకేతిక సమస్యలొస్తున్నాయి. అందు కోసమే లైన్‌మెయింట్ నెన్స్, చెట్ల కొమ్మలను తొల గించడం కోసం 15 బృందాలను సిద్ధం చేశాం.

నిరంతరాయ విద్యుత్‌సరఫరా కోసం మీరు తీసుకుంటున్న చర్య లేమిటి?

ఈఈ: నిరంతరాయ విద్యుత్ సర ఫరా కోసం 33 కేవీ లైన్‌కు బాధ్యులుగా డిప్యూటీ ఈఈని, 11 కేవీ లైన్‌కు ఏఈలు, ఎల్‌టీ లైన్‌లకు బాధ్యులుగా లైన్ ఇన్ స్పెక్టర్, లైన్‌మెన్‌లను బాధ్యులుగా నియమించాం.

ఇప్పటికీ నగరంలో అనేక ప్రాంతాల్లోలో ఓల్టేజ్ సమస్య ఉంది కదా?

ఈఈ: గుంటూరు నగరంతో పాటు మంగళగిరి పట్టణంలో కూడా లోఓల్టేజ్ సమస్య లేకుండా ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో 132 కేవీ సబ్ స్టేషన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో మంజూరైన రూ.11. 73 కోట్ల వ్యయంతో త్వరలోనే నిర్మాణ పనులు పూర్తవుతాయి. అది పూర్తయితే సమస్య ఉండదన్నారు. వెంగళాయపాలెం, బుడంపాడులో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లు ప్రారంభదశలో ఉన్నాయి. అవి రెండూ త్వరలో ప్రారంభిస్తాం.

నగరంలో ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు ఉన్నాయా....

ఈఈ: ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గంలో రూ. 35 లక్షలతో నాలుగు ట్రాన్స్‌పార్మర్స్ ,తూర్పులో కూడా రూ.35 లక్షలతో మరో నాలుగు ట్రాన్స్ పార్మర్స్ ఏర్పాటు చేశాం. కొత్తగా కూడా ప్రతిపాదనలు పంపిస్తున్నాం.

కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ డెవలప్ చేసుకోండి

● ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్ర వర్మ


ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న మహేంద్ర వర్మ

వట్టిచెరుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని నేటి సాంకేతిక రంగంలో పోటీ పరంగా కమ్యూనికేషన్ స్కిల్, టెక్నికల్ స్కిల్స్ డెవలప్ చేసుకొని మరిన్ని విభిన్న ఇన్నోవేషన్ ఐడియాలతో సొంత కంపెనీలు ప్రారంభించే దిశగా ఎదగాలని ఆర్‌వీ ఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్ర వర్మ పేర్కొన్నారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో ఏఐ, సీఎస్ఈ, ఏఐఎంఎల్ మూడో సంవత్సరం విద్యార్థులకు మేక్ స్కిల్ కంపెనీల ఆధ్వర్యంలో కొనసాగిన 36 గంటల ఎక్స్‌పో బుధవారం ముగిసింది. విద్యార్థినిల ఇన్నోవేటివ్ వీడియోలను ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్ర వర్మ, మేక్ స్కిల్ సీఈవో మధు పరిశీలించి తగు సూచనలు చేశారు. మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ ఇన్నోవేటివ్ ప్రాజెక్టులతో మలినేనిని అగ్రగామిలో నిలపాలని కోరారు. గెలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డీ.శ్రీనివాస కుమార్, హెడ్ చార్లెస్ జయరావు, ఏఐఎంఎల్ హెడ్ రవికిరణ్ అభినందించారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధి కారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్‌తో కలిసి డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశం బుధారం నిర్వహించారు. రెవెన్యూ ఇన్ స్పెక్టర్ల వారీగా వసూళ్ళ పై సమీక్షించిన కమిషనర్, పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన సర్వేలో ఆస్తి పన్ను లేకుండా గుర్తించిన వాటికి తదుపరి సమావేశం నాటికి పన్ను విధింపు జరగాలని, తదుపరి సమావేశానికి పాత బకాయిల వసూళ్లు, సర్వేలో గుర్తించిన సుమారు రూ.4 వేల ఆస్తులకు నూతన పన్ను విధింపులో పురోగతి ఉండాలని, వసూళ్లకు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్. ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు రెహమాన్, రవికిరణ్ రెడ్డి, శివన్నారాయణ, సాదిక్ భాష, సూపరిండెంట్ వెంకట రామయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాలు, స్పేర్‌పార్టులు అమ్మే దుకాణాలు

- సెకండ్ హ్యాండ్, స్పేర్ పార్టుల కాణాచి మాయాబజార్
- గుంటూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సముదాయం
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఓల్డ్ మోటార్ మార్కెట్
- చుట్టుపక్కల నాలుగు జిల్లాలకు అదే కేరాఫ్ అడ్రస్
- ఇక్కడ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన లాల్‌జాన్ భాషా

గుంటూరుకు మిర్చి ఘాటు ఎంత ప్రత్యేకమో.. మాయా బజార్ అంతే ప్రత్యేకం. ఎక్కడో దక్షిణాదిలోని ఒక నగరంలో వున్న ఈ ఓల్డ్ మోటార్ మార్కెట్.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందంటే నమ్ముతారా..? ఇక్కడ ప్రస్థానం మొదలు పెట్టి పార్లమెంటు స్థాయికి ఎదిగిన మహా నాయకులున్నారంటే ఔరా అనుకోరా? కానీ అదే నిజం! ఈ వాస్తవాలన్నీ ఒక ఎత్తయితే.. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ మార్కెట్ తనకదే ఎన్నో కథలు రచించుకుంది. ఎన్నో వదంతులకు ఆలవాలమయింది. ఎన్నెన్నో అపవాదులు మోసింది. మాయా బజార్ గురించి ఎవరికి వారు తమకు తోచిన కథ తాము చెప్పుకుంటూ పోతుంటారు.. కానీ అసలు కథ ఏంటన్నదే అసలు ప్రశ్న!

మాయా బజార్!

● చైన్ బ్యాచ్ రఫీ కాలంలో మహర్దశ

పది ఖార్ఖానాలతో మొదలైన ఓల్డ్ మోటార్ మార్కెట్ చైన్ బ్యాచ్ రఫీ హయాంలో మహర్దశకు చేరిందని చెబుతుంటారు. విద్యావంతుడైన ఆయన యువకులకు మార్కెట్‌లో పని కల్పిస్తూ మార్కెట్‌ను విస్తరించడానికి కృషి చేశాడని ప్రతీతి. దీంతో వేలాదిమంది యువకులకు అక్కడ ఉపాధి కల్పించేందుకు కృషి చేశారని చెబుతుంటారు. ఫలితంగా పది ఖార్ఖానాలతో మొదలైన మార్కెట్ ఆ తరువాత 200 షాపులకు విస్తరించింది. అక్కడ రిపేరు చేయని కార్లు, లారీలు, వాహనాలు, దొరకని స్పేర్ పార్ట్‌లు ఉండేవి కావంటే అతిశయోక్తి కాకపోవచ్చు. మెర్సిడెస్ బెంజ్ కారు మొదలు మారుతీ కారు వరకూ, అశోక్ లేలాండ్ భారీ వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్టులు, రిపేర్లు సహా అన్నీ అక్కడ దొరికేవి. గుంటూరు ఓల్డ్ మార్కెట్‌కు వస్తే మాయ చేసి మంత్రం వేసినట్లు ఎలాంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో చాలా మంది మార్కెట్‌ను వాడుక భాషలో మాయా బజార్ అనుకునేవారు. ఆ విధంగా అది కాలక్రమంలో 'మాయాబజార్'గా రూపాంతరం చెందింది. ఆ తరువాత విస్తరణకు అవకాశం లేకపోవడం మార్కెట్‌కు మార్కెట్‌కు శాపంగా మారింది.

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాయా బజార్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. వందేళ్ల క్రితం బ్రిటీష్ పాలనలో ఇప్పుడున్న పల్నాడు బస్టాండు ప్రాంతంలో ఈ ఓల్డ్ మోటార్ మార్కెట్ పురుడు పోసుకుంది. పది మంది మోటార్ మెకానిక్కులు ఖార్ఖానాలు పెట్టుకుని కార్లు, లారీలు ఇతర మోటార్ వాహనాలకు రిపేర్లు చేసేవారు. జాతీయోద్యమకాలంలో ఈ మెకానిక్ ఖార్ఖానాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం దాన్ని ప్రస్తుతం వున్న గుంటూరు పాత బస్టాండు ప్రాంతానికి తరలించారు. విశాలమైన ప్రాంతం వుండడంతో ఖార్ఖానాలు దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందాయి. అప్పట్లో ప్రతిష్టాత్మకమైన రోల్స్ రాయిస్, ఫోర్డ్ కార్లు, డాడ్జ్ లారీలకు రిపేర్లు చేయగల స్థాయి మెకానిక్కులు, ఖార్ఖానాలు ఇక్కడే ఉండేవి. జాతీయోద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా ఈ మార్కెట్‌కు లాల్ బహదూర్ ఓల్డ్ మోటార్ మార్కెట్ అని పేరు పెట్టుకున్నారు. అదే విలువలతో ఖార్ఖానాలు నడిపారు. మద్యం సేవించి ఖార్ఖానాల్లోకి రావడం, మార్కెట్ ప్రాంగణంలో అడుగు పెట్టాక పొగ తాగడం నేరాలుగా భావించేవారు. అలా వస్తే వారి నోటి నిండా తేనే పోసి వెగటు పుట్టేలాగా చేసి అలవాట్లు మాన్పించేవారని పాత తరం వారు చెబుతున్నారు. పెద్దలను గౌరవించకపోతే శిక్షలు కఠినంగా ఉండేవని చెబుతున్నారు. ఇలా ఈ సంస్కృతి దాదాపు 7 దశాబ్దాలపాటు కొనసాగించారంటే అతిశయోక్తి కాదు.

● ఆటోనగర్‌కు విస్తరణ

నగరం నడిబొడ్డున ఉండడంతో విస్తరించే అవకాశం లేకపోవడంతో చాలా షాపులు ఆటో నగర్‌కు వెళ్లిపోయాయి. అక్కడ జాతీయ స్థాయిలో వ్యాపారాలు జరుగుతున్నాయి. ఢిల్లీ నగరం నుంచి వేలాది వాహనాల స్పేర్ పార్టులు ఇక్కడికి వస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం ప్రతి ఏటా ఒక్క ఢిల్లీతోనే 100 కోట్ల టర్నోవర్ నడుస్తోందని చెబుతున్నారు. 1990ల్లో జిల్లా కలెక్టర్‌గా వచ్చిన జన్నత్ హుస్సేన్ మాయాబజార్‌ను ఆటో నగర్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. కార్లు, లారీల వంటి భారీ వాహన ఖార్ఖానాలు ఆటోనగర్ తరలిపోవడంతో ప్రస్తుతం మోటార్ సైకిల్, ఆటోల ఖార్ఖానాలు మాత్రమే అక్కడ మిగిలాయి. గత రెండు, మూడు దశాబ్దాల్లో ఓల్డ్ మోటార్ మార్కెట్ ప్రభ కొంత మేరకు తగ్గిందనే చెప్పాలి. పాత తరం స్థానే వచ్చిన కొత్త తరం ఆనాటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలూ లేకపోలేదు. అయినప్పటికీ ఇప్పటికీ ఈ చుట్టుపక్కల ఉన్న నాలుగైదు జిల్లాలకు సెకెండ్ హ్యాండ్ అవసరాలను తీరుస్తోంది. వేల మందికి ఉపాధి కల్పిస్తోంది.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళిగా మాయా బజార్ ముఖద్వారం



● ఇక్కడి నుంచి పార్లమెంటుకు

గుంటూరు ఓల్డ్ మోటార్ మార్కెట్ వాహనదారుల అవసరాలు తీర్చడమే కాదు.. జాతీయ స్థాయి నాయకత్వాన్ని కూడా అందించింది. ఇక్కడ స్పేర్ పార్టుల ఖార్ఖానా నడిపిన లాల్‌జాన్ భాషా టీడీపీ తరుపున చట్ట సభల్లో కాలు పెట్టారు. భారత పార్లమెంటులో తన గళం వినిపించారు. భువనేశ్వర్, కోల్‌కతా నుంచి పనికి రాని వాహనాల విడి భాగాలను తరలించి అతిపెద్ద మార్కెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆ పునాదులతోనే ఆయన రాజకీయంగా ఎదిగారు. పార్లమెంటులో అడుగుపెట్టి మార్కెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. ఆ తరువాతి కాలంలో మార్కెట్ బాగా విస్తరించింది.

సహన మృతి బాధాకరం

కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థికసాయం

ఇలాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరిస్తాం

24గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాం

బాధలో ఉంటే ధైర్యం చెప్పాలి.. రాజకీయాలు తగదు

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్

తెనాలి మారీసుపేట,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయిలో నిలవాల్సిన సహన(25) బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ అన్నారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన సహన (25) కొల్లిపరమండలం వల్లభాపురానికి చెందిన నవీన్‌కి మధ్య జరిగిన ఘటనలో బ్రెయిన్ డెడ్‌తో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బుధవారం తెనాలిలోని ఐతానగర్‌కు తీసుకువచ్చారు. మంత్రి మనోహర్ సహన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు.

కుటుంబసభ్యలకు ధైర్యం చెప్పి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10లక్షల చెక్కును ప్రభుత్వం తరుపున అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిమనోహర్ మాట్లాడుతూ అల్లారు ముద్దుగా పెంచిన కుమార్తె అనుకోని సంఘటనతో మృతి చెందితే ఆ తల్లిదండ్రులు పడే ఆవేధన వర్ణనాతీతమన్నారు. అటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. కాని ప్రతిపక్షపార్టీ మాత్రం అందుకు భిన్నంగా రాజకీయం చేసేందుకు రావడం బాధాకరమన్నారు. ఆడబిడ్డ బ్రెయిన్ డెడ్‌తో మృతి చెంది ఆ కుటుంబసభ్యులకు తీరని సోకాన్ని మిగిల్చిందన్న ఆలోచన లేకుండా ఇష్టానుసారం మాట్లాడటం సరైన విధానం కాదన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు చేయాల్సిన మంచి పనులపై మాట్లాడితే స్వాగతిస్తామన్నారు. 5ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి తాడేపల్లి ప్యాలెస్ సాక్షిగా చేసిన ఘటనలను ప్రజలు మరవలేదని రాజకీయాలకు ఆడబిడ్డలను అడ్డుపెట్టుకోవడం సంస్కారం కాదని హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ అమల్లో ఎక్కడా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించేది లేదన్నారు. ఘటన జరిగిన 24గంటల్లోనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడని చెప్పారు. సహన కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సహన అంత్యక్రియలు పూర్తి

సహన అంత్యక్రియలు కుటుంబసభ్యులు బుధవారం పూర్తి చేశారు. సహన మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుని ఆవేదనకు లోనయ్యారు. క్రిష్టియన్ మతాచారం ప్రకారం ఆమె అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు.

గ్రీన్‌గ్రేస్ భవన సముదాయం ప్రజలకు సంబంధం లేదా...?

ఆర్‌టీఐ కింద సమాచారం కోరితే రైల్వే సమాధానం ● ఏడీఆర్‌ఎం వద్ద అప్పీల్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అర్జీదారుడు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నల్లపాడు రైల్వేసెక్షన్‌లో రైలుపట్టాలకు అతి సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ భవన సముదాయం విషయంలో రైల్వే శాఖపరంగా తీసుకొన్న చర్యలపై సమాచారం ఇచ్చేందుకు ఆ శాఖ ఇష్టపడటం లేదు. ఇది ప్రజలకు సంబంధం లేదని పేర్కొంటూ సమాచార హక్కు చట్టం కింద పెట్టిన అర్జీని తిరస్కరించింది. జీ+16 భవన సముదాయం నిర్మాణ దశలో రైలుపట్టాలపైకి ఒరిగితే ఆ సమయంలో పెద్ద ప్రమాదమే తలెత్తే అవకాశం ఉన్నది. అదే జరిగితే వందల సంఖ్యలో ప్రయాణీకుల ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. మరోవైపు రైలుపట్టాలు కుంగిపోయినా రైలు ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉన్నది. ఇది ప్రజలకు సంబంధించిన అంశం అయినప్పటికీ రైల్వే శాఖ సమాచారం ఇవ్వకపోతుండటంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

నగరంలోని పట్టాభిపురంలో ఉన్న రైల్ వికాస్ భవన్‌కి అతి సమీపంలోనే వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ గ్రీన్‌గ్రేస్ పేరుతో భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. జీ+5 అపార్టుమెంట్ నిర్మాణం పేరుతో ప్లాన్, రైల్వే శాఖ ఎన్‌వోసీ తీసుకొని అందుకు విరుద్ధంగా జీ+16 భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ అక్రమంపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గొంతు విప్పడంతో నగరపాలకసంస్థ, రైల్వే, విజిలెన్స్, పొలూష్యన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖలు రంగంలోకి దిగాయి. ఎట్టకేలకు భవన సముదాయం నిర్మాణాన్ని నిలుపుదల చేయించాయి. కాగా రైల్వే శాఖ నిర్లక్ష్యంపై సమాచార హక్కు చట్టం కింద ఒక ఉద్యమకారుడు అర్జీ పెట్టారు. 2023లో ఎన్‌వోసీ రద్దు అయినట్లే భావించాలని పేర్కొంటూ భవన నిర్మాణాలను నిలుపుదల చేయించాలని రైల్వే శాఖ మునిసిపల్ కార్పొరేషన్‌కు లేఖ రాసింది. అయితే కార్పొరేషన్ స్పందించకపోతే రైల్వే శాఖ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు, చీఫ్ సెక్రెటరీకి నివేదించాలి. వారు కూడా స్పందించకపోతే దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్‌కు నివేదించి కేంద్ర ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొనేందుకు విజ్ఞప్తి చేయాలి.

రైల్వే శాఖ తీసుకొన్న చర్యల గురించి ఆర్‌టీఐ ఉద్యమకారుడు సమాచారం కోరితే ఇది ప్రజలతో సంబంధం లేనందున మీ అర్జీని ఫలాన సెక్షన్ కింద తిరస్కరిస్తున్నామని గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ఒక అధికారి సమాధానం ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని ఆ వ్యక్తి అప్పిలేట్ అథారిటీ అయిన ఏడీఆర్‌ఎంకు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించారు. ఒకవేళ ఏడీఆర్‌ఎం కూడా అర్జీని తిరస్కరిస్తే సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

వరద నష్టం అక్రమాలపై ముగిసిన విచారణ

రూ 17.5 లక్షల సొమ్మును తిరిగి చెల్లించిన నకిలీ రైతులు

మేడికొండూరు అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత నెలలో సంభవించిన వరదల కారణంగా మేడికొండూరు మండలంలోని పలు గ్రామాలలోని రైతులకు పంట నష్టం పరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. పంట నష్టం పరిహారం పొందిన వారిలో అనేక మంది వ్యవసాయం చేయనివారు ఉండడంతో ఆరా తీయగా అక్రమాలు బయట పడ్డాయి. దీనిపై పంట నష్టం పరిహారం స్వాహా పేరిట ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. గత వారం రోజులుగా కొనసాగిన విచారణ బుధవారం ముగిసింది. ఇప్పటి వరకు వరద నష్టం జాబితాలో ఉన్న వారు తాము వ్యవసాయం చేయలేదని తమ ఖాతాలో ఎలా పడ్డాయో తెలియదంటూ 17లక్షల 50వేల రూపాయలను విచారణ అధికారులకు చెల్లించారు. జరిగిన విచారణ నివేదికను జిల్లా ఉన్నతాదికారులకు నివేదిస్తామని విచారణ అధికారులు తెలిపారు.

సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదకు మేడికొండూరు మండలంలోని 8 గ్రామాలలో సుమారు 220 హెక్టార్లలో ప్రత్తి పంట దెబ్బతింది. 33శాతానికి మించి పంట నష్టం జరిగిందని స్థానిక అధికారులు జాబితా అందజేశారు. దాని ప్రకారం పంట నష్టపరిహారం క్రింద 3కోట్ల 75లక్షల రూపాయల ప్రభుత్వం రైతులకు అందజేసింది. నష్టం పరిహారం పొందిన 5వందల మందిలో భూ యాజమానులతో పాటు కౌలు రైతులు కూడా ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది రైతులు కాదని తేలింది. ఈ జాబితాను ఆన్‌లైన్ చేసే సమయంలో కొందరు వ్యవసాయశాఖ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించారు. ఒక ప్రవేటు వ్యాపారి, గ్రామ వ్యవసాయ సహాయకుడు (విఏఓ) కుమ్మక్కై వ్యవసాయం చేయని వారిని జాబితాలో చేర్చి వారిపేరట బ్యాంకు ఖాతాలో పడిన సొమ్మును వేర్వేరు కాణాలు చెప్పి డ్రాచేయించి స్వాహా చేశారు. విచారణ ప్రారంభం కాగానే అక్రమాలకు పాల్పడిన వారు అప్రమత్తమై తాము స్వాహా చేసిన సొమ్మును జాబితాలో ఉన్నవారికి ఇచ్చి తమ బ్యాంక్ ఖాతాలో ఎలా పడ్డాయో తెలియదని అధికారులకు చెల్లించమని ప్రాధేయపడ్డారు. మండలంలో వరదలు వచ్చినా పంట నష్టం అంతగా లేదని కొద్ది మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లిందని అధికారుల పరిశీలనలో తేలింది. అంతేకాకుండా వ్యవసాయం చేయని వారి పేర్లు పంట నష్టం జాబితాలోకి ఎలా వచ్చాయి. వారికి కౌలు రైతు కార్డులు ఎలా ఇచ్చారు అనే విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది. జాబితా తయారీలో పాల్గొన్న అధికారుల నుంచి కూడా వివరణ తీసుకున్నామని విచారణ లో పాల్గొన్న అధికారులు వివరించారు.

హాస్టల్ గదిలో 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం వద్ద గల ఓ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలో ఎనిమిదో తరగతి చదువుతున్న కరణం పద్మసుధ (13) అనే విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నల్లపాడు సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేటకు చెందిన కరణం అనిల్ కుమార్, పావని దంపతులకు మహావీర్ (16), పద్మ సుధ (13) సంతానం ఉన్నారు. మహావీర్ నర్సరావుపేటలోని ప్రైవేట్ స్కూల్లో చదువుతుండగా, పద్మసుధ గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం లోని ఓ కార్పొరేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చింది. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి సుమారు 8. 30 గంటల సమయంలో తోటి విద్యార్థులు స్టడీ అవర్ లో ఉన్న సమయంలో ఆమె హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన వార్డెన్, సిబ్బంది , ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. అయితే పద్మసుధ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులకు ధృవీకరించారు వెంటనే వార్డెన్ చిలకలూరిపేటలో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమ కుమార్తె మృతిపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు బుధవారం ఉదయం స్కూల్ ఎదుట మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇంటిపై బెంగతోనే ఆత్మహత్య చేసుకుందని హాస్టల్ సిబ్బంది వాపోయారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

ఎస్పీఎఫ్ అంటేనే ఒక ధీమా



కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, వేదిక పైన పోలీసు ఉన్నతాధికారులు త్రివిక్రమ వర్మ, బీవీ రామిరెడ్డి తదితరులు

రాష్ట్ర హోం మంత్రిగా పనిచేయడం నా పూర్వజన్మ సుకృతం

ఏపీఎస్పీఎఫ్ 33వ వార్షిక క్రీడల్లో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత



పోలీస్ అధికారులు, సిబ్బందితో గ్రూప్ ఫోటోలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

పెదకాకాని, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీసు వ్యవస్థ అంటే ఒక భయం ఉండేదని, నేడు ఆ భయం వీడి భద్రత వైపు సమాజం నడుస్తుందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీఎఫ్) 33వ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోజువారి విధులనుంచి బయటకు వచ్చి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ విధి అంటేనే 24/7 అనే నినాదం ఉంటుందని ప్రజల, ప్రభుత్వాల, ధన, మాన, ప్రాణాలు రక్షించడమే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. పోలీస్ వ్యవస్థ ఒత్తిడితో కూడుకున్న వ్యవస్థగా ఉంటుందని నేటి తరం పోలీసులు బాధ్యతగా నిలిచి విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. హోంగార్డు నుంచి ఐపీఎస్ వరకు ప్రతి వ్యవస్థలో, ప్రతి హోదాలో వారి వారి శ్రమ అనిర్వచనీయమని పేర్కొన్నారు.

వారి ఓపికకు సలాం అంటూ కితాబిచ్చారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అంటేనే ఒక గౌరవం ఉందని ఈ సందర్భంగా అనిత పేర్కొన్నారు. ఈమధ్య విజయవాడకు వచ్చిన వరదలకు ఎస్పీఎఫ్ వ్యవస్థ నిరంతరం నిద్రాహారాలు మాని శ్రమించారన్నారు . ప్రజల ప్రాణాలను కాపాడటంలో వారు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. హోంశాఖ మంత్రిగా విధులు నిర్వహించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని ఇందులోకి మహిళలను కూడా తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. వీరికి సంబంధించి శాశ్వత భవనాల ఏర్పాటు, శిక్షణ ప్రాంతాలకు సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పోలీసు వ్యవస్థను గౌరవంగా భావిస్తారని ఆయన సహకారం తో పోలీసు వ్యవస్థకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీలు డాక్టర్ త్రివిక్రమ్ వర్మ, రామిరెడ్డి, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో నగరవనం పార్కు



ఆహ్లాదం.. వినోదం.. సాహసం



గుడిసె

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండలో ఆకట్టుకుంటున్న నగర వనం

రూ 1.40 కోట్లతో ఏర్పాటు చేసిన అటవీశాఖ

ప్రఖ్యాత శైవ క్షేత్రం.. పర్యాటక కేంద్రం కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం యాత్రికులను ఆకట్టుకుంటోంది. ఆహ్లాదం.. సాహసం.. వినోదం కలగలపి నగరవనం నిర్మించారు. తాటి కలపతో నిర్మిచిన స్వాగత ద్వారం, పూరి గుడిసెలు ఆకర్షిస్తున్నాయి. కోటప్పకొండ గిరి ప్రదిక్షణ మార్గంలో నగరవనం.. గిరివన విహార్.. గిరి బాల విహార్ పేర్లతో ఉద్యానవనాలు రూపుదిద్దుకున్నాయి. కొండ వెనక ప్రాంతంలో పండ్ల.. పూల మొక్కలతో వనాలను పెంచుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ వనాలు రూపుదిద్దుకున్నాయి. వీటని కేంద్రియ నగర వన యోజన పథకం కింద అటవీ శాఖ చేపట్టింది. రూ 1.40 కోట్ల వ్యయం చేస్తున్నారు. పంచతత్వ పేరుతో నరకదారి నిర్మిచారు. చిన్నారుల కోసం ఆట వస్తువులతో ప్రత్యేక పార్కు.. సాహసక్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పెట్లూరివారిపాలెం - కోటప్పకొండ మార్గంలో నగరవనం రూపుదిద్దుకుంది. నగరవనం, గిరి బాలవి హార్, గిరి వనవిహార్‌లను త్వరలో ప్రారంభించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. వనాల్లోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ప్రవేశ రుసుము రూ 20 వసూలు చేస్తున్నారు.



నగరవనంలో చిల్డ్రన్స్ పార్కు



సాహసక్రీడా ప్రాంగణం

చింతలపూడిలో భూ రీసర్వేపై 65 అర్జీలు

దుగ్గిరాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో జరిగిన భూ రీసర్వేలో రైతులు ఎదుర్కొన్న సమస్యలపై గ్రామసభను బుధవారం నిర్వహించారు. డీపీ అగ్రహారంలో జరిగిన గ్రామసభలో ఏడు అర్జీలు రాగా చింతలపూడిలో జరిగిన గ్రామసభలో 65 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. మండల సర్వేయర్ గోపాలరావు, ఆర్ఐ త్రివేణి, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఏపీ టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వేములపాటి అజయ్‌కుమార్‌ను మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. -మంగళగిరి(ఆంధ్రజ్యోతి)

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెదనందిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎం ఉమాదేవి బుధవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీలో నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహణ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రతిరోజూ ఆహారాన్ని రుచిచూచి పరిశీలించి అనంతరం విద్యార్థులకు అందించాలని తెలిపారు. పాఠశాలలో సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో లక్ష్మీదేవి ఉన్నారు.

తగ్గిన వరద ఉధృతి

తాడేపల్లిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 34 వేల 581 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 21 వేల 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువలకు 7 వేల 822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు తెలిపారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 5009 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 5009 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధి కారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడు గుల నీటిమట్టం ఉండగా, దిగువకు 21, 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 226 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1356, తూర్పు కాల్వకు 443, పశ్చిమ కాల్వకు 198, నిజాంపట్నం కాల్వకు 460, కొమ్మమూరు కాల్వకు 1873 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

212 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన వేలంలో 212 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.10,111, గరిష్ట ధర రూ.12,000, మోడల్‌ధర రూ.11, 700 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.11,700, గరిష్ట ధర రూ.11,850, మోడల్ ధర రూ.11,700 పలికాయి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీ ఆరో పటాలంలో బుధవారం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు.

అరచేతిలో ఉపాధి సమాచారం

- కూలీలకు ఆసరాగా జన్‌మన్‌రేగా యాప్
- అక్రమాలపై ఫిర్యాదు చేసే అవకాశం కూడా
- అధికారులు పారదర్శకంగా పనిచేసేందుకు దోహదం

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు తాము పనిచేసిన పూర్తి సమాచారంతో పాటు తమ కూలి సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అయిందా? లేదా? అని తెలుసుకునేందుకు ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోనికి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకం కూలీలు తాము పనిచేసిన రోజు మస్టర్ పడుతుందో లేదో.. తాము పని దినాలకు సరైన వేతనం తమ బ్యాంకు ఖాతాల్లో పడుతుందో లేదో అని తెలుసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల చుట్టూ, ఉపాధిహామీ కార్యాలయం చుట్టూ, పోస్టాఫీసుల చుట్టూ వ్యయప్రయాసలతో తిరగాల్సి వస్తుంది. అలాంటి ఇబ్బందులకు చెక్ పెడుతూ ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా తమ వద్ద నున్న ఆండ్రాయిడ్ ఫోన్‌లో పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకునే వీలును కల్పించింది. అంతే గాకుండా ఉపాధి హామీ పథకంలో ఏమైనా అక్రమాలు జరుగుతున్నా ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. పథకంలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా అధికారులు పనిచేసే విధంగా ఈ యాప్ ఉపయోగపడుతుంది.



జన్‌మన్‌రేగా యాప్

కూలీలకు ఎంతో ఉపయోగం

ఈ జన్‌మన్‌రేగా యాప్ ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బ్యాంకుల వినియోగం పెరిగిన సమయంలో ప్రతి ఒక్కరు వారి అవసరాలకు అనుగుణంగా పలు బ్యాంకుల్లో తమ ఖాతాలు తెరుస్తున్నారు. అన్ని ఖాతాలకు ఆధార్ లింక్ అవుతుండటం వల్ల ఏ బ్యాంకులో తమ సొమ్ము పడుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఈ యాప్ ద్వారా తమ సొమ్ము ఏ బ్యాంకు ఖాతాలో జమయిందో తెలుసుకోవచ్చు.

కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తే..

అయితే ఈ యాప్‌పై కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిపై ఉపాధిహామీ పథకం అధికారులు కూలీలకు ఎలాంటి అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటుంది. కొద్దో గొప్పో అవగాహన కూడా చేసుకోగలుగుతారు. అంతే కాకుండా ప్రతి కుటుంబంలోనూ విజ్ఞానవంతులు ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ యాప్‌పై ఉపాధి హామీ కుటుంబసభ్యులకు అవగాహన కల్పిస్తే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను కూటమి నేతలు బుధవారం పంపిణీ చేశారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన చెన్నం గోపీకృష్ణకు రూ.7 లక్షలు, అప్పికట్ల కామేశ్వరరావుకు రూ.1.58 లక్షలు, చినకాకాని గ్రామానికి చెందిన లింగినేని కృష్ణారావుకు రూ.83 వేల చొప్పున చెక్కులను అందజేశారు. మంగళగిరి 17వ వార్డుకు చెందిన తాడిశెట్టి శ్రీనివాసరావుకు రూ.2.17 లక్షలు, 19వ వార్డుకు చెందిన తిరువీధుల రమేష్‌కు రూ.80 వేల చొప్పున సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, కూటమి నాయకులు షేక్ రియాజ్, వాకా మంగారావు, జంజనం వెంకట సుబ్బారావు, తేలు వెంకటేశ్వరరావు, తాడిచర్ల వీరన్న, దామర్ల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెం దిన కొలనుకొండ శ్రీకాంత్, అభినయ్‌ల కుమార్తె అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. పాప తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.46,443లు మంజూరయ్యాయి. మంత్రి లోకేశ్ ఆదేశాలతో స్థానిక నాయకులు బుధవారం శ్రీకాంత్, అభినయ్‌ల ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌కు సిఫార్సు చేసిన లోకేశ్‌కు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, దొప్పలపూడి జ్యోతిబసు, రాయపూడి కిరణ్, రెంటపల్లి రాజేష్, గాదె వినయ్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కూటమి నేతలు

స్కేటింగ్‌లో విజ్ఞాన విహార విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యాభారతి అఖిల భారత శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చినట్టు ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. విజ్ఞాన విహారకు చెందిన విద్యార్థులు ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలను సాధించారన్నారు. నాలుగో తరగతి చదువుతున్న డి.వెంకట సాయి మనోహర్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సెంట్రల్ విజిలెన్స్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించే విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ప్రతినిధులు బుధవారం అరవింద సీబీఎస్ఈ హైస్కూల్ కుంచనపల్లిలో నిర్వహించారు. విజిలెన్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ వారోత్సవాల ద్వారా పిల్లల్లో ఉన్నత విలువలు పెంచి అవినీతి రహితంగా దేశాభివృద్ధే లక్ష్యంగా ఉంచుతూ పారదర్శకతతో ఉండేలా చేయాలనే సంకల్పంతో అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్స్ శ్రీమతి రజియ, నవ్య, సోషల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సుమంత్, ఉపాధ్యాయులు పాల్గొని అందరూ అవినీతి రహితంగా ఉండాలని హితబోధ చేశారు.

కేఎల్‌యూకు వాటర్ అవార్డ్సులో ద్వితీయ బహుమతి

తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, జలవనరుల శాఖ, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవ శాఖ ప్రకటించిన ఐదో జాతీయ నీటి అవార్డులు 2023లో ఉత్తమ సంస్థ కేటగిరిలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి ఆలిండియా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు ఈ నెల 22న న్యూఢిల్లీలోని న్యూ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన పురస్కార కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నుంచి తాను పురస్కారాన్ని అందుకున్నట్టు కేఎల్‌యూ వీసీ సారధివర్మ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వివిధ వర్గాలలో నీటి వనరుల నిర్వహణ, పరిరక్షణలో అత్యుత్తమ విజయాలను గుర్తిస్తుందన్నారు. వర్సిటీకి ద్వితీయ బహుమతి రావడంపై యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.


కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న కేఎల్‌యూ వీసీ సారధివర్మ

ఎంపీయల్ సీజన్-3 పోటీలకు సన్నాహాలు

● 27న మంగళగిరి క్రికెటర్లకు ఎంపిక పోటీలు

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ సహకారంతో ప్రతిఏటా నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా వచ్చే ఏడాది జనవరిలో ఈ టోర్నీ జరుగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఉమ్మడి జిల్లా నుంచి ప్రతిభ కలిగిన జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. ఎంపీయల్ సీజన్-3కి సంబంధించి మంగళగిరి నియోజకవర్గం నుంచి ప్రతిభ కలిగిన క్రికెటర్లను ఎంపిక చేయనున్నారు. నవులూరు గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో ఈ నెల 27వ తేదీన సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు మాత్రమే హాజరు కావాలని, తప్పనిసరిగా ఆధార్, ఓటరు కార్డు జిరాక్సు తీసుకురావాలని టీడీపీ నేతలు సూచించారు. ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో పాల్గొనే అవకాశాన్ని మంగళగిరి నియోజకవర్గ యువత, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను చేపట్టారు. సమ్మె శిబిరాన్ని ప్రారంభించిన చెంగయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత చాలీచాలని వేతనాలతో క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం బాలాజీ, పిల్లలమర్రి బాలకృష్ణ, రవి, మణి, నానీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్శిటీ ఐసీఏఆర్, ఎన్ఏఏఆర్ఎం మధ్య ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషన్ తదితరులు

గుంటూరు(విద్య), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంతో హైదరాబాదులోని ఐసీఏఆర్ - ఎన్ఏఏఆర్ఎం (నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి మేనేజమెంట్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, ఉమ్మడి పరిశోధనలు చేయడంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.నాగభూషన్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీరావు, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

● డాక్టర్ రామ్నాథ్ వెలమాటి


రామ్నాథ్‌కు సరస్వతీదేవి జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ విద్యాసాగర్

పెదకాకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు అన్ని రంగాల్లో నిష్ణాతులు కావాలని పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించి భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాలని గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ) వైస్ చైర్మన్ డాక్టర్ రామ్నాథ్ వెలమాటి అన్నారు. బుధవారం వీవీఐటీ కళాశాలలో నిర్వహించిన విజన్-2047 సదస్సుకు ముఖ్యవక్తగా ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో రామ్నాథ్ మాట్లడుతూ ప్రస్తుతం దేశంలో యువతకు అవకాశాలు అరుదుగా ఉన్నాయని వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోవు 25 సంవత్సరాలు దేశ అభివృద్ధిలో కీలకమని తెలిపారు. యువత వ్యాపారవేత్తలుగా ఎదగడానికి విజన్ 2047లో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాబోవు మూడు సంవత్సరాల్లో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న ఆశాభావం వ్యక్తపరిచారు. అనంతరం రామ్‌నాథ్, శాఖమూరు శ్రీనివాస్ ప్రసాద్‌ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ సూర్యదేవర బదరి ప్రసాద్ సత్కరించారు.

విద్యార్థులు కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

● ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో


విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్ర వర్మ

వట్టిచెరుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని నేటి సాంకేతిక రంగంలో పోటీపరంగా కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్ డెవలప్ చేసుకొని విభిన్న ఇన్నోవేషన్ ఐడియాలతో సొంత కంపెనీలు ప్రారంభించే దిశగా ఎదగాలని ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్ర వర్మ పేర్కొన్నారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21, 22 తేదీల్లో ఏఐ, సీఎస్ఈ, ఏఐఎంఎల్ మూడో సంవత్సరం విద్యార్థులకు మేక్ స్కిల్ కంపెనీల ఆధ్వర్యంలో కొనసాగిన 36 గంటల హాక్థాన్ బుధవారం ముగిసింది. అలాగే హాక్థాన్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆర్‌వీఆర్‌జేసీ ఎస్‌టీపీ ఫౌండేషన్ సీఈవో మహేంద్రవర్మ, మేక్ స్కిల్ సీఈవో మధులు హాజరై విద్యార్థినుల ఇన్నోవేటివ్ వీడియోలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ మలినేని విద్యార్థులు వారి ఇన్నోవేటివ్ ప్రాజెక్టులతో మలినేనిని అగ్రగామిలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డీ శ్రీనివాసకుమార్, హెడ్ చార్లెస్ జయరావు, ఏఐఎంఎల్ హెడ్ రవికిరణ్ తదితరులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

సహన మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

తాడికొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన సహన మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు డిమాండ్ చేశారు. బుధవారం తాడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉండాలని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి సహన కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చింతల భాస్కర్‌రావు, రైతు సంఘం నాయకులు కనగాల పూర్ణచంద్రరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రేమ్‌కుమారి, సరళ, రజని, స్వాతి, పిచ్చిమ్మ, వీరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు, సీఐటీయూ నాయకులు

భూ సమస్యల పరిష్కారానికి కృషి : డీటీ కరిముల్లా

పెదనందిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా అన్నారు. మండల పరిధిలోని అన్నవరంలో రీసర్వేలో జరిగిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సభలో భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం 20 అర్జీలు రైతులు అందజేసినట్లు తెలిపారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సాహితీ. సీనియర్ అసిస్టెంట్ యోహోషువా, సిబ్బంది పాల్గొన్నారు.

● కాకుమాను, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్లిమర్లలో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభను డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత నిర్వహించారు. గ్రామ సభలో 190 అభ్యంతరాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వ హయాంలో బోడిపాలెం, కొల్లిమర్ల గ్రామాల్లో రీ సర్వే జరిగిందని ఆ సర్వే వల్ల వచ్చిన అభ్యంతరాలపై నుంచి అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో డానియేల్, తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని నిరసన

పెదనందిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోస్టాఫీసు వద్ద నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ యూనియన్ ఆదేశాలు మేరకు బుధవారం సిబ్బంది కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. పని భారం తగ్గించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇన్సూరెన్స్‌లు, అర్జీలు, డిపాజిట్లు, నెలవారీ పొదుపు కలెక్షన్ ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వసూలు చేయాలంటూ భారం మోపుతున్నారని ఆరోపించారు.

ఎంఎస్ఎంఈ సర్వే పరిశీలన

మేడికొండూరు అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మేడికొండూరులో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే తీరును మండల పరిషత్ అధికారి తోట చందన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడికొండూరు మండలాన్ని ఎంఎస్ఎంఈ సర్వేకు పైలెట్‌గా ఎంపిక చేశారని అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న దుకాణాలు, వివిధ సంస్థలను సర్వే చేస్తామన్నారు. వీటన్నింటిని డిజిటల్ ప్లామ్‌ఫామ్ అనుసంధానం చేయడం కోసం సర్వే జరుగుతుందని చెప్పారు.

బాలల స్నేహ గ్రామంగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న తాటి తులసీరామ్

తాడికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దామరపల్లి గ్రామాన్ని బాలల స్నేహ గ్రామంగా తీర్చిదిద్దాలని టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు తాటి తులసీ రామ్ పిలుపునిచ్చారు. బుధవారం దామరపల్లి గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్-క్రాప్ ఆధ్వర్యంలో బాలల భాగస్వామ్య ప్రాముఖ్యతపై గ్రామ బాలల సంబంధిత కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తులసీరామ్ ఈ సందర్భంగా మాట్లాడారు. బాలలకు వారి అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి బాలల ఆలోచనలను అందించటానికి, నిర్ణయాత్మక ప్రక్రియలో చురుగ్గా పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏవీ పాండు రంగారావు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి డాక్టర్ తబితా శాంతి, క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ జీ వెంకట్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పీ మురళీధర్, సచివాలయం హెల్త్ స్టాఫ్ మాధవి, డ్వాక్రా, అంగన్‌వాడీ, క్రాప్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం ఊరేగింపు

తుళ్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు కొత్తూరు కోదండ రామాలయ ధ్వజ స్తంభాన్ని అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో గ్రామంలో బుధవారం ఊరేగించారు. మంగళవాయిద్యాలతో శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహం వెనక ధ్వజస్తంభాన్ని ట్రాక్టర్లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కాకుమాను వెంకటేశ్వరావు లక్ష్మీ దంపతుల సారధ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 27న ఉదయం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారని కోదండ రామస్వామి భక్త కమిటీ పేర్కొంది.

పిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలి

మేడికొండూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ కోనూరి అశోకరాణి జయకుమార్ చెప్పారు. పేరేచర్లలోని ఇంటెల్ హైస్కూల్లో బుధవారం చైల్డ్ రైట్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, తద్వారా మానసిక ధైర్యాన్ని పొందుతారని అన్నారు. విద్యాబోధన సమయంలోను పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లల హక్కుల గురించి చెప్పాలన్నారు. రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది పిల్లలకు ఉన్న హక్కుల గు రించి, వారు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేయడంతో పాటు ప్రమాదం తలెత్తినప్పుడు స్పందించే విధానం గురించి వివరించారు.

టీడీపీ నేత కొసరాజు మృతికి సీఎం సంతాపం

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత కొసరాజు వెంకట రాయుడు మృతికి సీఎం చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తంచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పొన్నూరులో టీడీపీ బలోపేతానికి ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. సీనియర్ నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



పశు పోషకులకు వరం మినీగోకులం పథకం

● పశుసంవర్ధక శాఖ ఏడీ నాగిరెడ్డి



తెనాలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు వరంలా మినీ గోకులం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి చెప్పారు. బుధవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పలు అంశాలపై ఫటాఫట్..

మినీగోకులం పథకం అంటే?

డాక్టర్ నాగిరెడ్డి: పశుపోషకులకు షెడ్ల నిర్మాణం భారం కాకుండా ప్రభుత్వం మినీగోకుల పథకాన్ని తీసుకువచ్చింది.

షెడ్ల నిర్మాణానికి ఎవరు అర్హులు..?

డాక్టర్ నాగిరెడ్డి: ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు ఎవరైనా సొంత స్థలం కలిగి పనికి ఆహార పథకం జాబ్‌కార్డుదారులు పశు సంవర్ధక శాఖ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

సబ్సిడీ పోగా ఎంత ఖర్చు అవుతుంది?

డాక్టర్ నాగిరెడ్డి: రెండు పశువులున్న షెడ్డు నిర్మాణానికి రూ.1.15లక్షలు కాగా సబ్సిడీతో రూ.11.500 పశుపోషకుడు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

కఠెవరం పంచాయతీలో అధ్వాన పారిశుధ్యం

- ముంపుతో ప్రజలకు ఇక్కట్లు
- బీసీ కాలనీలో నిలిచిన వర్షంనీరు
- పందుల స్వైరవిహారం
- పొంచిఉన్న వ్యాధుల ముప్పు





ముంపులోనే ఉన్న కఠెవరం శివారు కాలనీ, బీసీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

తెనాలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క కురుస్తున్న వర్షాలతో నీరు నిలుస్తుంటే మరో పక్క పంచాయతీలు చేపట్టాల్సిన పారిశుధ్య పనుల లోపంతో మురుగు నీటిలోనే ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. మండలంలోని కఠెవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు కాలనీ దాదాపుగా వారం రోజులుగా ముంపులోనే ఉంది. అదేవిధంగా గ్రామంలోని బీసీ కాలనీ రోడ్లువెంబడి కాలువల నిర్వహణ సైతం అంతంతమాత్రంగానే ఉండటంతో వర్షపునీరు కాలువల నీరు ఏకమై పాదచారులకు, స్థానిక నివాసితులకు నరకం చూపిస్తున్నాయి. వీటికి తోడు గ్రామంలో వ్యర్థాలను రోడ్ల వెంబడి పారబోయడంతో పందులు చేరి అపరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి. ప్రభుత్వాలు గ్రామాలను స్వచ్ఛత వైపు నడిపించేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంటే ఇక్కడ మాత్రం వాటిపై పెద్దగా స్పందన కనిపించడంలేదు. తెనాలి బాలాజీరావుపేట అయప్పపురం - కఠెవరం రోడ్డులోని కఠెవరం పంచాయతీ శివారు కాలనీ జలమయంగా మారి అపరిశుభ్ర వాతావరణంలో ప్రజలు గత వారం రోజులుగా మగ్గుతున్నా అధికార యంత్రాంగం, పంచాయతీ యంత్రాంగం సైతం అటువైపు కన్నెత్తి చూసిన పరిస్థితి లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. వర్షపునీరు ఇంటి చుట్టూ చేరి ఇంటిలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్న తమకు రక్షణగా నిలవాల్సిన అధికారయంత్రాంగం కూడా పట్టించుకోకపోతే తమ పరిస్థితి ఏమిటని కాలనీవాసులు వాపోతున్నారు. చుట్టుచేరిన వర్షపు నీటికి ఇంటి గోడలు నానుతున్నాయని రోజులు తరబడి నీరు నిలిచి ఉండటంతో దోమల ఉధృతి పెరగడంతో పాటు విషసర్పాలు సంచారం చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. తమ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో ఇప్పటికే పలువురు అనారోగ్య సమస్యల బారినపడ్డారని మరింతమంది ఆసుపత్రుల పాలవ్వక ముందే మంత్రి మనోహర్ తమ పరిస్థితిపై దృష్టిపెట్టి అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న వ్యర్థాల్లో స్వైరవిహారం చేస్తున్న పందులు



వెంకటరాయుడుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, టీడీపీ నాయకులు, వెంకటరాయుడు (ఫైల్ ఫొటో)

కొసరాజు మృతి టీడీపీకి తీరనిలోటు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 23: కొసరాజు వెంకట రాయుడు అకాల మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ డైరెక్టర్ కొసరాజు వెంకట రాయుడు అంత్యక్రియలు బుధవారం జరిగాయి. వెంకట రాయుడు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నిడుబ్రోలు విచ్చేసి వెంకట రాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకట రాయుడు మృతదేహంపై తెలుగుదేశం పార్టీ పతాకాన్ని కప్పి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. వెంకట రాయుడు కుటుంబ సభ్యులను నరేంద్ర కుమార్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వెంకట రాయుడు క్రియాశీలక పాత్రను పోషించారని కొనియాడారు. నిడుబ్రోలులో టీడీపీ అభివృద్ధికి వెంకటరాయుడు చేసిన సేవలు ఎనలేనివన్నారు. తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి హయాం నుంచి వెంకటరాయుడుతో తన కుటుంబానికి మంచి అనుబంధం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, జాగర్లమూడి సుధీర్, పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబూరావు, పఠాన్ ఫైరోజ్‌ఖాన్, గోగినేని రజని కుమార్, తదితరులు నివాళులు అర్పించారు. అలాగే సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వరరావు, ఆచార్య రంగా జయంత్యోత్సవ కమిటీ నిర్వాహకులు రామినేని కిషోర్‌బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, డాక్టర్ రవీంద్ర బాబు, తదితరులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు సంస్థల నిర్వాహకులు వెంకటరాయుడుకు నివాళులు అర్పించారు.

రహదారులపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

● కమిషనర్ రమేష్‌బాబు



కూరగాయల మార్కెట్‌లో వ్యర్థాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, అక్టోబరు 23: రహదారులపై, మార్జిన్లలో వ్యర్థాలను వదలివేస్తే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్‌ను కమిషనర్ రమేష్‌బాబు సందర్శించారు. మార్కెట్‌లో కూరగాయలు ఆకుకూరల వ్యర్థాలను రహదారులపై వదిలివేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వినియోగదారులు ప్రజలతో ఇబ్బందులు కలిగేలా వ్యర్థాలను పడవేస్తే అపరాధ రుసుము విధించనున్నట్లు హెచ్చరించారు. అలాగే మార్కెట్ ప్రాంగణంలో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి రూరల్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ ద్వారా మండలంలో తలపెట్టిన అభివృద్ధిపనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టనున్న పల్లెవనం, ఇతర కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాణా సంచా విక్రయదారులు లైసెన్స్‌లు తీసుకోవాలి: తహసీల్దార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 23: దీపావళి పండుగ సందర్భంగా బాణ సంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని తహసీల్దార్ మహ్మద్ జీయావుల్ హక్ ఆదేశించారు. పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయానికి చెందిన ఖాళీ భూమిని బుధవారం అధికారుల బృందం పరిశీలించింది. బుధవారం క్రాకర్స్ స్టాల్స్ కోసం స్థల పరిశీలన చేశారు. ఈ విక్రయ కేంద్రం వద్ద ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయదారులు లైసెన్స్‌లు తప్పనిసరిగా పొందాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు, అగ్నిమాపక శాఖ అధికారులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పీడితవర్గాల సంక్షేమం కోసం ప్రొఫెసర్ సాయిబాబా ఎనలేని కృషి చేశారని నిర్బంధ వ్యతిరేక వేదిక ప్రతినిధి కె.రవిచంద్ర పేర్కొన్నారు. కవిరాజా పార్కులో అరసం కార్యదర్శి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షతన బుధవారం సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఆదివాసుల కోసం ఆయన జీవితాన్ని త్యాగంచేశారని, వైకల్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆయనను అణచివేసే ధోరణితో వ్యవహరించిందన్నారు. మోపిదేవి రాందేవ్, కొల్లిపర బాబుప్రసాద్, జీఎస్ నాగేశ్వరరావు, శివకృష్ణ, మోజెస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ సేవాభావమే ఎన్‌సీసీ లక్ష్యం: సుదర్శన్

చేబ్రోలు, అక్టోబరు 23: విద్యార్థి స్థాయి నుంచి క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకోవడమే ఎన్‌సీసీ లక్ష్యమని ఎన్‌సీసీ గుంటూరు కమాండింగ్ అధికారి ఎస్వీఎస్ సుదర్శన్ అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ పూర్తి చేసుకున్న 34మంది బాలికలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు ఎన్‌సీసీ శిక్షణ దోహదపడుతుందన్నారు. దేశ రక్షణలో విద్యార్థులు ఎన్‌సీసీ ద్వారా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఏహెచ్‌వీ ప్రసాద్, రాయల సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులపై సీఐటీయూ నిరసన

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులపై సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ప్రదర్శన చేశారు. జిల్లా సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ, మహిళల ధన, మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, దాడులు పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వల్ల పరిష్కారం దొరకదని ఈ పరిస్థితులను రాజకీయాలకు వాడుకోకుండా మంచి సలహాలు ఇవ్వాలని చెప్పారు. పోలీసు వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలని, సమాజంలో ఎక్కడ ఏం జరుగుతుందో శాంతి భద్రతలకు ఎలాంటి సమస్యలు వాటిల్లుతున్నాయో నిఘా వేయాలని కోరారు. సహన కుటుంబానికి న్యాయం చేయాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, లావణ్య, పుష్ప, పావని, నాగలక్ష్మి, ఏవీఎస్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

● చేబ్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సహన హంతకుడు నవీన్‌ను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. చేబ్రోలులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు శ్రద్ధ వహించడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాఘవమ్మ, హనుమంతరావు, శారద, దీపిక, తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

● డాక్టర్ రామనాథ్ వెలమాటి



డాక్టర్ రామనాథ్ వెలమాటికి సరస్వతి దేవి చిత్రాన్ని అందజేస్తున్న ఛైర్మన్ విద్యాసాగర్, బదరీప్రసాద్

పెదకాకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టిసారించి భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాలని గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్‌టీ) వైస్‌ఛైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమాటి అన్నారు. బుధవారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన విజన్-2047 సదస్సుకు ముఖ్యవక్తగా ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో రామనాథ్ వెలమాటి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో యువతకు అవకాశాలు అరుదుగా ఉన్నాయని వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోవు 25 సంవత్సరాలు దేశ అభివృద్ధిలో కీలకమని తెలిపారు. విద్యార్థులు జ్ఞానాన్ని పరిమితం చేసుకోకుండా అధునిక నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. యువత వ్యాపారవేత్తలుగా ఎదగటానికి విజన్ 2047లో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. యువత దేశం గురించి, దేశ భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. భవిష్యత్తు అంచనా వేయడమే విజన్ అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వలన నేడు దేశంలోనే పర్ క్యాపిటాలో హైదరాబాద్ మొదట ఉందన్నారు. రాబోవు మూడు సంవత్సరాలలో భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న ఆశాభావం వ్యకం చేశారు. విద్యార్థులు నిత్యం నూతన అంశాలను తెలుసుకుంటూ ఉండాలన్నారు. అపార జ్ఞానం తెలుగు వారి సొంతం అని, బహుళ జాతీయ సంస్థలలో తెలుగు వారు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అనంతరం డాక్టర్ రామ్‌నాథ్ వెలమాటి, శాఖమూరు శ్రీనివాస్ ప్రసాద్‌ను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ సూర్యదేవర బదరీ ప్రసాద్ సత్కరించారు.

ఆస్తి పన్నును సకాలంలో చెల్లించండి: కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని పురపాలక సంఘ కమిషనర్ శేషన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. నూతనంగా ఇల్లు నిర్మించుకున్నవారు తమ ఇంటి గుర్తులను పురపాలక సంఘ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఖాళీ స్థల యజమానులు తమ స్థలాలోని పిచ్చి మొక్కలను వ్యర్థాలను తొలగించుకోవాలని లేనియడల మున్సిపల్ అధికారులు ఆ ఖాళీ స్థలాలలోని పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించి వాటికైన ఖర్చులను స్థల యజమానుల నుంచి పురపాలక సంఘ కార్యాలయానికి జమ చేయిస్తామని తెలిపారు. కొంతమంది ఆస్తి పన్నులు చెల్లించక మున్సిపల్ కార్యాలయానికి బకాయిలున్నారని వారు అపరాధ రుసుమతో కలిపి చెల్లించాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పట్టణంలోని మూడవ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని, సుందర తెనాలికి రూపకల్పనకు అందరూ సహకరించాలన్నారు. వ్యర్థాలను, చెత్తను ఇంటి వద్ద పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. అనంతరం వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా బోధనను మెరుగుపర్చండి

హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధనను మెరుగు పర్చాలని మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాలయుతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన వెబ్‌ఎక్స్‌కు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధానంగా కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ అపార్, పేరెంటు - టీచర్ మీటింగ్ ఇతర ముఖ్యమైన విద్యాపరమైన విషయాలను చర్చించామని తెలిపారు. పాఠశాలలో నిర్వహిచే ప్రతి కార్యక్రమంలో తల్లిదండ్రులను, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోళ్లమూడిపాడు ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, కుర్చీలు అందజేసిన నాట్కో నిర్వాహకులు

పాఠశాలకు నాట్కో ట్రస్ట్ బెంచీలు వితరణ

పొన్నూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం బెంచీలు వితరణ చేశారు. పాఠశాలకు అవసరమైన 25వేల రూపాయల విలువైన బెంచీ, కుర్చీలను అందించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్టు కో ఆర్డినేటర్ కె రంగారెడ్డి, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్‌పీఐ (ఎ) పార్టీ నాయకులు నిర్వహించారు. చినరావూరు డొంక రోడ్డులో బుధవారం పట్టణ ఆర్‌పీఐ (ఎ) పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌పీఐ (ఎ) పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు పాల్గొని 20మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాలయ్య, భానుచందర్, కుమార్, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమ శిక్షణతో విద్యను బోధించాలి: ఎంఈవో

కొల్లిపర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమ శిక్షణతో విద్యను బోధించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు, చివలూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై, ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.